# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక: 32 కడప, 3-12-2025, బుధవారం పేజీలు: 8 వెల: 1.00

## కమల్ కంట నీళ్లు

తిరువనంతపురం, డిసెంబర్ 2,

మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ పదవి తనకు 71 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం వచ్చినంత సంతోషాన్ని ఇచ్చిందని ఆయన భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఈ అనుభవాన్ని పంచుకున్నారు. పెద్దల సభకు ఎంపీగా ఎన్నికైనప్పుడు మీ అనుభూతి ఏంటని ఓ వ్యక్తి ప్రశ్నించగా, కమల్ బదులిస్తూ ఆ క్షణంలో తన తల్లిదండ్రులు డి.శ్రీనివాసన్ అయ్యంగార్, రాజ్యలక్ష్మి గుర్తుకువచ్చారని తెలిపారు.

# త్వరలో ఏర్పాటు..

## సీఎం చంద్రబాబు కీలక ప్రకటన




అమరావతి, డిసెంబర్ 2: ఆర్టీసీకి మరో వెయ్యి ఈవీ బస్సులు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఏపీ ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సచివాలయంలో విద్యుదుత్పత్తి, పంపిణీలో వ్యయం తగ్గింపుపై అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

'ప్రభుత్వ భవనాలపై విస్తృత స్థాయిలో సౌర విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది ప్రోత్సాహకాలు కొనసాగించాలి. ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఈవీ బస్సులు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలి. ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు 60 రోజుల్లో కార్యరూపం దాల్చాలి. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఎంవోయూలు కుదుర్చుకోవాలి. ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంవోయూలు చేసుకోవాలి. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల్లోనూ విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి' అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

వైసీపీపై విమర్శలు..

సమీక్షలో సీఎం చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యుత్ వ్యవస్థపై గత ప్రభుత్వం చేసిన పనులపై ఆయన మాట్లాడారు. 'అసమర్థ నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని గత పాలకులు అస్తవ్యస్థం చేశారు. పీపీఏ రద్దుతో రూ.9వేల కోట్ల భారాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రజలపై మోపింది. విద్యుత్ వినియోగించకుండానే ప్రజా ధనాన్ని కంపెనీలకు చెల్లించింది' అని విమర్శించారు.

నిధులు విడుదల..

కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో అభివృద్ధి పనులకు ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.7.92 కోట్ల అదనపు నిధులు విడుదలకు ప్రభుత్వం పరిపాలనా పరమైన ఉత్తర్వులు జారీ చేసింది. రాయలసీమ యూనివర్సిటీలో భవన నిర్మాణాల చెల్లింపులకు నిధులు వెచ్చించాలని సూచించింది. తదుపరి చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉన్నత విద్యాశాఖను ప్రభుత్వం ఆదేశించింది.

# కీలక ఆదేశాలు జారీ..



## రాజధానిలో రెండో విడత

## భూ సమీకరణకు ఆదేశాలు జారీ

అమరావతి, డిసెంబర్ 02: రాజధాని అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాజధాని అభివృద్ధి కోసం రెండో విడత భూ సమీకరణ చేపట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. అందుకు సంబంధించిన ఆదేశాలను మంగళవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ జారీ చేశారు. ఏడు గ్రామాల్లో మొత్తం 16,666.57 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏకు అప్పగిస్తున్నట్లు ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు.

పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో.. వైకుంఠపురంలో 1,965 ఎకరాలు,పెదమద్దూరులో 1,018 ఎకరాల పట్టా, యండ్రాయి గ్రామ పరిధిలో 1,879 ఎకరాలు పట్టా, 46 ఎకరాల అసైన్డ్ భూమితోపాటు కర్లపూడి, లేమల్లే 2,603 ఎకరాలు పట్టా భూమి, 51 ఎకరాల అసైన్డ్ భూమి సమీకరించనుంది.

ఇక గుంటూరు జిల్లాలోని తుళ్లూరు మండలంలోని 3 గ్రామాల పరిధిలో.. వడ్డమానులో 1,763.29 ఎకరాల పట్టా, 4.72 అసైన్డ్ భూమి.. హరిశ్చంద్రాపురంలో 1,448.09 ఎకరాలు పట్టా, 2.29 అసైన్డ్ భూమి.. పెదపరిమిలో 5,886.18 ఎకరాల పట్టా భూమి సమీకరణ చేపట్టాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. 7 గ్రామాల్లో కలిపి 16,562.52 ఎకరాల పట్టా భూములు, 104.01 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించాలని సీఆర్ డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ భూ సమీకరణలో 3828.30 ఎకరాలు ప్రభుత్వ భూమి కూడా ఉంది.




# డ్రైవర్‌తో గొడవ..

%ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. స్కూల్ బస్సుపై క్లీనర్ పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అర్ధవీడు మండలం పాపినేని పల్లిలో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది

మంగళవారం ఉదయం ఆ స్కూల్ బస్సును నడుపుతున్న డ్రైవర్, క్లీనర్ మధ్య ఏదో విషయమై గొడవ జరిగింది. దీంతో క్లీనర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెట్రోల్ తీసుకొచ్చి బస్సుపై వేసి నిప్పంటించాడు. దీంతో బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయింది. అప్పటికింకా పిల్లలెవరూ బస్సు ఎక్కకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది (

%ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ నభికి మంటలు అంటుకుని స్వల్పంగా గాయాలయ్యాయి (. అతడిని స్థానికులు వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. పెట్రోల్ పోసి నిప్పంటించిన క్లీనర్ గోపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## జగన్‌పై ఎమ్మెల్యే ఫైర్.. రూ. వెయ్యి పెంచేందుకు ఆయనకు ఐదేళ్లు పట్టింది

అనంతపురం: పింఛన్ సొమ్ము రూ.వెయ్యి పెంచేందుకు జగన్‌కు ఐదేళ్ల పట్టిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శించారు. రాజీవ్ కాలనీ పంచాయతీలోని మరాఠీకాలనీ, 16వ డివిజన్‌లోని బాబానగర్, 38వ డివిజన్‌లోని కోవూరు నగర్‌లో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వంలో ర్యారాష్ట్రానికి ఎలాంటి పెట్టుబడులు రాలేదని, ఆఖరికి విశాఖపట్నంలో ప్రభుత్వ ఆఫీసులను తాకట్టు పెట్టారని, ఆయన మరోసారి సీఎం అయి ఉంటే రాష్ట్రాన్ని పూర్తిగా తాకట్టు పెట్టేవారని ఈ సందర్భంగా దుయ్యబట్టారు.



అనంతపురం క్లాక్‌టవర్: ఏడాదిలో నగర రూపురేఖలు మార్చేస్తామని, అందుకు ప్రణాళికను అమలు చేయబోతున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. 38వ డివిజన్‌లోని విద్యారణ్య పాఠశాల వద్ద రూ.39లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భూమిపూజ చేశారు. అలాగే 27వ డివిజన్‌లో రూ.70లక్షలతో పూర్తి చేసిన అశోక్‌నగర్ మెయిన్ రోడ్డును శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు.

కూటమి వచ్చాక నగరంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. గుంతల రోడ్లను బాగు చే స్తూ.. మురుగు కాలవల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఏడాదిలోపు నగర రూపురేఖలు మార్చే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ బా లస్వామి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకీర్, ఎంపీడీఓ దివాకర్, మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాషనాయుడు, వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, టీడీపీ జిల్లా అధికారప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ బల్లాపల్లవి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, భావన, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, రాయల్‌మురళి, సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు రమేష్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు భవానీ రవికుమార్, పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వర్, శివ, పవన్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను వయోపరిమితి సాకుతో తొలగించడం దారుణమని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపాలు, ఉపాధ్యక్షులు సురేషబాబు, వెంకటప్ప, చిరంజీవి, ఓబులేసు, రాఘవ, గంగాధర్, అంజి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరులో దారుణం.. ఒకే ఇంట్లో..

%తిరుపతి, డిసెంబర్ 02: తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామినేడు ఇందిరమ్మ గృహ సముదాయంలో దారుణం చోటు చేసుకుంది. స్థానికంగా ఒక ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఆ ఇంటి తలుపులు పగలకొట్టారు. ఆ ఇంట్లో నిర్జీవంగా పడి ఉన్న మూడు మృతదేహాలను గుర్తించారు. అనంతరం ఈ మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులు సత్యరాజ్, పొన్నాగుట్టె నాయగి, మనీష్‌గా పోలీసులు గుర్తించారు. ఒకే ఇంట్లో మూడు మృతదేహాలు బయటపడడంతో స్థానికంగా కలకలం సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ సందర్భంగా సత్యరాజ్ గురించి స్థానికులను పోలీసులు విచారిస్తున్నారు. సత్యరాజ్ స్వస్థలం.. తమిళనాడులోని గుడియాతం. అతడు భార్యను వదిలి.. అదే ప్రాంతానికి చెందిన పొన్నాగుట్టె నాయగి (30)తో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. మూడు నెలల క్రితం నాయగితోపాటు ఆమె మూడేళ్ల కుమారుడితో కలిసి గుడియాతం నుంచి దామినేడు ఇందిరమ్మ గృహ సముదాయంలోని ఇంట్లో కాపురం పెట్టాడు. స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ వీరు జీవనం సాగిస్తున్నారు.

అయితే నవంబర్ 22వ తేదీ ముందు వీరిని చూశామని.. ఆ తర్వాత వీరు ఇంటి నుంచి బయటకు రాలేదని పోలీసుల విచారణలో స్థానికులు వివరించారు. మహిళతోపాటు ఆమె కుమారుడిని చంపి సత్యరాజ్ ఆత్మహత్య చేసుకున్నాడా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై తమిళనాడులోని గుడియాత్తం పోలీసులకు తిరుచానూరు పోలీసులు సమాచారం అందించారు. సత్యరాజ్ కుటుంబ సభ్యులు వస్తేనే కానీ అసలు విషయాలు బహిర్గతం కావని పోలీసులు చెబుతున్నారు.

## తిరుపతి కేంద్రంగా ఆధ్యాత్మిక అభివృద్ధి: మంత్రి అనగాని



తిరుమల: తిరుపతి సెంట్రల్ జోన్‌గా చేసుకొని ఆధ్యాత్మిక అభివృద్ధికి సీఎం ఆదేశించారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఏపీలో పాజిటివ్ వాతావరణం నెలకొందని, ప్రతి నెలా నూతన ఉత్తేజం, నూతన పెట్టుబడులతో భావితరాలకు మార్గనిర్దేశం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. విశాఖలో సీఐఐ సమ్మిట్ ద్వారా రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులతో 15 లక్షల మందికి ఉపాధి కల్పించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై టుడా చైర్మన్‌తో చర్చించినట్లు తెలిపారు. "విశాఖ, సెంట్రల్, రాయలసీమ మూడు జోన్‌లుగా విభజించి రాష్ట్రాభివృద్ధి జరుగుతోంది. రాయలసీమ జోన్‌కు తిరుపతి కేంద్రంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్న సీఎం కాంక్షకు అనుగుణంగా ఏర్పాట్లు సాగుతున్నాయి" అని అనగాని తెలిపారు.

భారత శక్తి

# సర్.. బేజార్...

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఈమేరకు దాఖలైన పిటిషన్లపై రెండు రోజులపాటు సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ నిర్వహించి తదుపరి విచారణ డిసెంబర్ 2కు వాయిదా వేసింది. బీహార్ రాష్ట్రంలో ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఇప్పుడు 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సవరణ నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిర్వహణ పేరుతో చట్టసభల విధులను ఎన్నికల కమిషన్ తనకు తాను చేపట్టినట్టుగా ఈ కసరత్తు సాగుతోందని, రాజ్యాంగ పరిమితులను దాటి నిర్హేతుకమైన నిబంధనలతో పౌరులపై తీవ్ర భారాన్ని ఎన్నికల కమిషన్ మోపుతోందన్న అభ్యంతరాలు తలెత్తుతున్నాయి. ఓటర్ల అర్హతను నిర్ణయించడానికి 11 పత్రాలు సమర్పించాలని ఎన్నికల కమిషన్ నిబంధన విధించింది. ఏ చట్ట ప్రకారం ఆ నిబంధన విధించారని పిటిషనర్లు నిలదీస్తున్నారు. అటువంటి చట్టాన్ని పార్లమెంట్, లేదా అసెంబ్లీలు మాత్రమే చేయాలని, వాటికి అతీతంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు. ఈ ప్రక్రియ ఫోటో ధ్రువీకరణ కోసం కాకుండా పౌరసత్వ తనిఖీ కోసం చేపట్టినట్టు కనిపిస్తోందని ఆక్షేపిస్తున్నారు. బూత్‌స్థాయి అధికారులుగా ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. వారి ద్వారానే పౌరసత్వాన్ని నిర్ధారించడం, ఆ తరువాత ఓటరుగా చేర్చాలో లేదో నిర్ణయించడం జరుగుతోంది. ఈ విధంగా పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు, లేదా రాజ్యాంగపరమైన విధి బూత్‌లెవెల్ ఆఫీసర్లుకు కట్టబెట్టడం తీవ్ర చర్చనీయాంశంగా సాగుతోంది. మరోవైపు గత ఓటర్ల జాబితాలతో ఇప్పటి నమోదు ఫారాలను పోల్చిచూస్తున్నారు. అప్పటి జాబితాల్లో ఓటరు ఏవైనా పొరపాట్లు చేస్తే ఆ కారణాలతో అతని సంతానానికి ఇప్పుడు ఓటు తిరస్కరించడం ఏమిటని పిటిషనర్లు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పౌరసత్వానికి ఆధార్‌కార్డు మాత్రమే ప్రామాణికం కాదని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం కూడా సమస్యగా మారింది. చొరబాటుదారులు కానీ, ఇక్కడ పనిచేస్తున్న విదేశీయులు కానీ రేషన్ కోసం ఆధార్ కార్డు సంపాదిస్తే వారు మన పౌరులేనని ధ్రువీకరించాలా అని సుప్రీం కోర్టు ప్రశ్నించడం సమంజమే.కానీ చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ కార్డు ఒక్కటే ప్రామాణికంగా ఓటర్లు భావిస్తుంటారు. వారు తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే మరే అధికారిక పత్రాలు వారి వద్ద ఉండవు. చాలామంది నిరక్షరాస్యులు కావడంతో ఈ నిబంధనలు వారికి తెలియడం లేదు. ఇవన్నీ క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాల తయారీకి ప్రతిబంధకాలవుతున్నాయి. ఓటరు నమోదు ఫారం 6 లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధారించుకునే అధికారం ఇసికి ఉందని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. కానీ ఆ నిర్ధారణే సరిగ్గా జరగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. బ్లాక్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్ఒ) అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లు నింపిన తరువాత ఆ వివరాలను 2002 2005 ఓటర్ల జాబితాలతో పోల్చిచూడడంలోనే చిక్కులు ఏర్పడుతున్నాయి. బీహార్ డేటా అక్కడి ఎన్నికల ఫలితాలను నాటకీయంగా మార్చలేకపోయినప్పటికీ ఓటర్ల లింగ నిష్పత్తిలో గణనీయమైన తగ్గుదల చూపింది. నిజమైన ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాల కోసం పెనుగులాడుతూనే ఉన్నారు. ఓటర్ల వివరాల నమోదుకు డాక్యుమెంటేషన్ ఈ 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వచ్చే నెలలోగా పూర్తి చేయవలసి ఉంది. బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలన్న నిబంధన కాగితాలపైనే కనిపిస్తోంది. ఓటర్లు స్థానికంగా నివాసం ఉంటున్నట్టు ఇప్పుడు నిరూపించుకోవలసి వస్తోంది. గతంలో ఓటు వేసినా, అప్పటి ఓటర్ల జాబితాలో తన పేరు ఉన్నా సరే ఇప్పుడు పాత రికార్డులతో పనిలేకుండా తాను స్థానికుడిననే చట్టబద్ధతగా నిర్ధారించుకోడానికి రుజువు చూపించక తప్పడం లేదు. ఎన్నికల కమిషన్ చేయవలసిన ఈ బాధ్యతలన్నీ పౌరులపైనే నెట్టేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ పరిస్థితి వల్ల చివరకు ఓటరు ప్రధాన హక్కులను తొలగించడమే అవుతుంది. ముఖ్యంగా వివాహితులైన మహిళలకు, వలసదారులకు ఇది అగ్నిపరీక్షే. స్థానిక నివాసిని గుర్తించడంలో కఠినంగా నిబంధనలు అమలు చేయాల్సిందేనని కోర్టు కూడా స్పష్టం చేయడంతో గుర్తింపు సమస్య జటిలంగా మారింది. దీన్ని గమనించి నిజమైన ఓటర్లను రక్షించే బాధ్యత పార్టీల ప్రతినిధులపైన, అధికారిక వాలంటీర్లపైన ఉందని కోర్టు సూచించింది. సవరించిన జాబితాల్లో తప్పులు సవరించారా లేక అలాగే కొనసాగుతున్నాయా అన్నది కోర్టు వరకు రావడం లేదు. అలాగే ఎన్నికల కమిషన్ కూడా పట్టించుకోవడం లేదు. ఎన్నికల కమిషన్ సహనంతో ఇంటింటికీ వెళ్లి పరిశీలించే పకడ్బందీ విధానం అనుసరిస్తే కానీ పొరపాట్లు తొలగిపోవు. అలా చేస్తేనే సార్వత్రిక వయోజన ఓటు హక్కును కాపాడగలుగుతారు. అంతేకాకుండా సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నకిలీ ఓటర్లను కూడా గుర్తించవచ్చు. ఈ విధంగా ఓటర్ల ప్రాథమిక హక్కును కాపాడడానికి బదులు ఓటర్ల జాబితాలను శుద్ధి చేయడమే ప్రధాన బాధ్యతగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోంది. 'సర్' ప్రక్రియ విస్తరిస్తున్న కొద్దీ విధానపరమైన పర్యవేక్షణకు మించి కోర్టు ఈ ప్రక్రియ రాజ్యాంగ బద్ధత పునాదులను పరిశీలించడం చాలా ముఖ్యం. అదే విధంగా గత కొన్నేళ్లుగా తాము ఓటర్ల జాబితాల్లోనే ఉన్నామని ఓటర్లే స్వయంగా నిరూపించుకోవాలన్న నిబంధన అనుసరించకుండా ఎన్నికల కమిషనే ఆ బాధ్యతను మళ్లీ తీసుకునేలా సుప్రీం కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పని ఒత్తిడికి తట్టుకోలేక ఉత్తరాదిన పులువులు బూత్ లెవల్ ఆఫీసర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారు. సర్వేష్ అనే బీఎల్వో వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. రెండు పేజీల సూసైడ్ నోట్‌లో బతకాలని ఉందని కానీ పని ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానని చెప్పుకొచ్చాడు.

# వైకుంఠ దర్శనానికి 24 లక్షల మంది దరఖాస్తులు

తిరుమల, డిసెంబర్ 02 (భారత శక్తి):

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు కొలువైన తిరుమలలో డిసెంబర్ 30వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకూ వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ద్వార దర్శనాలకు సంబంధించిన టోకెన్లను ఈ డిప్ ద్వారా కేటాయిస్తున్నారు. మొదటి మూడు రోజుల టోకెన్లను ఈ డిప్ విధానంలో కేటాయిస్తారు. ఈ డిప్ రిజిస్ట్రేషన్ కోసం భారీ స్పందన వచ్చింది. ఏకంగా 24 లక్షల మంది వైకుంఠ ద్వార దర్శనాలకు నమోదు చేసుకున్నారు. తిరుమల వైకుంఠ ద్వార దర్శనాల కోసం భారీగా డిమాండ్ వచ్చింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని డిసెంబర్ 30వ తేదీ నుంచి పది రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలను కల్పిస్తున్న సంగతి తెలిసిందే. అయితే భక్తుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మొదటి మూడు రోజులకు సంబంధించిన వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లను తిరుమల తిరుపతి దేవస్థానం ఈ డిప్ ద్వారా కేటాయించనుంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించగా.. ఈ-డిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువు సోమవారం సాయంత్రంతో ముగిసింది. డిసెంబర్ 30,31, జనవరి ఒకటో తేదీకి సంబంధించి మొత్తం లక్షా 80 వేల వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే 1.80 లక్షల టోకెన్ల కోసం ఏకంగా 24 లక్షల మందికిపైగా భక్తులు ఈ-డిప్ ద్వారా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయాన్ని టీటీడీ ప్రకటించింది. డిసెంబర్ 30 వైకుంఠ ఏకాదశి పర్వదినం కావటం.. ఆ మరుసటి రోజైన డిసెంబర్ 31 ద్వాదశి, జనవరి 1 నూతన సంవత్సరం కావటంతో భక్తులు భారీగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ మూడు రోజులకు గానూ 9.6 లక్షల రిజిస్ట్రేషన్ల ద్వారా 24,05,237 మంది భక్తులు వైకుంఠ ద్వార దర్శనాల కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు టీటీడీ తెలిపింది. ఈ డిప్ లాటరీని డిసెంబరు 2న తీయనున్నారు. ఇందులో ఎంపికైన భక్తులకు టీటీడీ టోకెన్లు కేటాయించనుంది. మొదటి మూడు రోజుల తర్వాత మిగిలిన ఏడు రోజులు శ్రీవారి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. అలాగే 300 రూపాయల దర్శనం టోకెన్లు రోజుకు 15 వేల చొప్పున జారీ చేయనున్నారు. శ్రీవాణి టికెట్లను కూడా రోజుకు వేయి చొప్పున కేటాయిస్తారు. డిసెంబర్ ఐదో తేదీన వీటిని ప్రత్యేకంగా టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అలాగే తిరుపతి స్థానికులకు కూడా శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల అవకాశం కల్పిస్తున్నారు. జనవరి 6, 7,8వ తేదీలలో ఆఖరి మూడు రోజులు రోజుకు 5వేల టోకెన్లు చొప్పున స్థానికులకు కేటాయిస్తారు. ఈ టికెట్లను డిసెంబర్ 10న విడుదల చేస్తారు. వైకుంఠ ద్వారా దర్శనాల నేపథ్యంలో ప్రోటాకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. మరోవైపు తిరుమల తరహాలోనే టీటీడీ పరిధిలోని ఇతర ఆలయాలలోనూ భక్తులకు




నిత్యాన్నదానం అమలు చేయనున్నారు. భక్తులకు అన్నప్రసాదాలను రుచిగా, శుచిగా, నాణ్యంగా అందించాలని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం అధికారులతో సమీక్షించిన టీటీడీ ఈవో.. పలు అంశాలపై చర్చించారు. టీటీడీ ఆలయాలలో అన్నప్రసాదాల పంపిణీ నేపథ్యంలో.. అన్నప్రసాదాల తయారు చేసే పోటు సిబ్బందికి శిక్షణ ఇప్పించాలని అధికారులకు సూచించారు. టీటీడీ ఆలయాలలో ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న అన్నప్రసాదాల వివరాలతో రోజువారీ నివేదిక రూపొందించాలన్నారు. టీటీడీలోఅన్య మతస్తులు ఉంటే వారిని గుర్తించాలని.. ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై నివేదిక తయారు చేయాలని టీటీడీ ఈవో అధికారులను ఆదేశించారు.

# విశాఖపట్నంలో కొత్తగా నాలుగు రోడ్లు..

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు దూసుకెళ్లొచ్చు..

విశాఖపట్టణం, డిసెంబర్ 02 (భారత శక్తి):

విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే ఏడు కీలక రహదారులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించడంతో, ఈ ప్రాజెక్టులను త్వరగా అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. అటవీ భూముల సమస్య



పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. టీడీఆర్‌ల ప్రక్రియను వేగవంతం చేస్తూ, విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేలోపే.. ఈ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నామన్నారు. నేరెళ్లవలస-తాళ్లవలస, వేపగుంట-పినగాడి, అడవివరం-శొంఠ్యాం, బోయపాలెం-కాపులుప్పాడ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని విమానాశ్రయ అధికారులు సూచించారని పేపర్కొన్నారు. అడవివరం-శొంఠ్యాం రోడ్డు నిర్మాణంలో అటవీశాఖకు చెందిన భూములున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి కలెక్టర్‌తో సంప్రదింపులు జరుపుతారు. గుత్తేదారులకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోతే, జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోడ్డు పనులను పర్యవేక్షించడానికి ఒక ఏఈని బాధ్యుడిగా నియమిస్తారు. టీడీఆర్‌లను అందించే ప్రక్రియను వేగవంతం చేయడానికి ఒక ప్రత్యేక బృందం పనిచేస్తుంది. విశాఖపట్నం చుట్టుపక్కల 8 జిల్లాలను అభివృద్ధి చేయడానికి విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది. వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఈ అథారిటీకి డిప్యూటీ సీఈవోగా వ్యవహరిస్తారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలోనే ఈ అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తా. కేంద్రం నుంచి వచ్చే నిధులతో అనేక ప్రాజెక్టులు ప్రారంభించనున్నారు. ఈ అభివృద్ధిలో భాగంగా, ఎంఐజీ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. డబ్బులు చెల్లించిన 48 గంటల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, ప్లాట్‌ను అప్పగించేలా చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం తాత్కాలికంగా వీఎంఆర్‌డీఏలో రిజిస్ట్రేషన్ డెస్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. సవరించిన మాస్టర్‌ప్లాన్ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే 3,500 అభ్యర్థనలపై నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాలను వచ్చే నెల మొదటి వారంలో సాంకేతిక కమిటీకి అందజేస్తారు. ఆ కమిటీ పరిశీలించి, ఆమోదించిన వాటిపై మళ్లీ ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరిస్తారు. అలాగే, ఈ నెల 29న జరిగే బోర్డు సమావేశంలో కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. ఈ ప్రాజెక్టులలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో (పీపీపీ) చేపట్టేవి కూడా ఉన్నాయి. భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చే ఏడాదికి అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. ఆలోగా విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే రహదారుల్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.


### డబుల్ డెక్కర్ బస్సులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నం వచ్చే పర్యాటకులు, అతిథుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆర్కేబీచ్ నుంచి తొట్లకొండ వరకు నడుస్తున్న ఈ డబుల్‌డెక్కర్ బస్సులను సింహాచలం వైపు నడిపేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మార్పు వెనుక ప్రధాన కారణం, ప్రస్తుతం ఉన్న మార్గంలో బస్సులకు ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడమే. పర్యాటకులను ఎక్కువగా ఆకట్టుకుని, బస్సుల వినియోగాన్ని, తద్వారా ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నారు. ఈ కొత్త మార్పులో భాగంగా, అధికారులు శనివారం ఒక ట్రయల్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. విశాఖ వ్యాలీ మార్గం గుండా జాతీయ రహదారిపై హనుమంతువాక, అడవివరం ప్రాంతాల మీదుగా సింహాచలం వరకు ప్రయాణించి, తిరిగి బీచ్‌రోడ్డుకు చేరుకుంది. ఈ విషయాన్ని సిబ్బంది తెలిపారు. నెల రోజుల క్రితం, ఓపెన్‌టాప్ డబుల్‌డెక్కర్ బస్సును అందుబాటులోకి తెచ్చినప్పుడే, ఈ రెండు బస్సులను ఆర్కేబీచ్, తొట్లకొండ ప్రదేశాల నుంచి బీచ్‌రోడ్డు మీదుగా సింహాచలం వరకు నడిపే ఆలోచన ఉందని అధికారులు అప్పట్లోనే తెలిపారు. ఇప్పుడు ఆ ఆలోచనను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలో పర్యాటకులలకు కొత్త అనుభూతిని అందించేందుకు ప్రభుత్వం 'హాఫ్ ఆన్ హాఫ్ ఆఫ్' పేరుతో రెండు డబుల్ డెక్కర్ బస్సులను ప్రవేశపెట్టింది. ఆగస్టులో ప్రారంభమైన ఈ బస్సులు ఆర్కే బీచ్ నుండి తొట్లకొండ వరకు నడుస్తున్నాయి. ఈ బస్సులో మొత్తం 11 స్టాపులలో ఆగుతూ పర్యాటక ప్రదేశాలను చూసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఎత్తైన డబుల్ డెక్కర్ బస్సు పైనుండి నగరాన్ని, సముద్రాన్ని వీక్షించడం ఒక అద్భుతమైన అనుభూతినిస్తుంది. విశాఖపట్నంలో డబుల్ డెక్కర్ బస్సుల్లో పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100 టికెట్ ధరతో (జీఎస్టీ అదనం). ఈ బస్సుల ద్వారా రోజుకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఆదాయం వస్తోందని చెబుతున్నారు. ప్రారంభంలో రోజుకు రూ.2వేల నుంచి రూ.3వేల ఆదాయం మాత్రమే వచ్చేది.. తర్వాత పర్యాటకుల ఆదరణ పెరిగింది. ఈ డబుల్ డెక్కర్ బస్సులు విశాఖలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన ఆర్‌కే బీచ్, టీయూ 142, కురుసురా మ్యూజియం, కైలాసగిరి, విశాఖ మ్యూజియం, ఇస్కాన్ టెంపుల్, రుషికొండ వేంకటేశ్వరస్వామి దేవాలయం, తెన్నేటి పార్కు, తొట్లకొండ మార్గంలో ప్రయాణిస్తాయి. కొన్ని సంస్థలు ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులను మొత్తంగా బుక్ చేసుకుంటున్నాయి. మొత్తం మీద విశాఖపట్నంలో నడుస్తున్న డబుల్ డెక్కర్ బస్సుల్ని సింహాచలం వరకు పొడిగించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

# చంద్రబాబుపై కేసులు క్లోజ్

విజయవాడ, డిసెంబర్ 02 (భారత శక్తి):

వైఎస్ జగన్ హయాంలో చంద్రబాబుపై పెట్టిన మరో కేసు కోర్టులో తెలిపింది. లిక్కర్ పాలసీ అక్రమాల కేసులో దర్యాప్తు పూర్తయినట్లుగా సీఐడీ కోర్టుకు తెలిపింది. అక్రమాలు జరిగినట్లుగా ఆధారాలేమీ లేకపోవడంతో కేసును క్లోజ్ చేస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 2023 అక్టోబర్ 30న ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు జరిగాయని సీఐడీ కేసు నమోదు చేసింది. 2014-19 మధ్య ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు, డిస్టిలరీలకు అర్హత లేకపోయినా లైసెన్సులు ఇవ్వడం, కొంతమంది సప్లయర్లకు ప్రయోజనాలు కల్పించారని కేసులు నమోదు చేశారు. సీఎంగా ఉన్న సమయంలో మద్యం తయారీ కంపెనీలకు అనుమతుల విషయంలో చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారని సీఐడీ అభియోగాలు మోపింది. పీసీ యాక్ట్ తో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. కొన్ని మద్యం తయారీ సంస్థలకు ప్రయోజనం చేకూరేలా చంద్రబాబు సర్కార్ వ్యవహరించిందని ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ మేరకు ఏపీ బేవరేజేస్ ఎండీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఏ1 గా సుధాకర్, ఏ2 కొల్లు రవీంద్, ఏ3 చంద్రబాబు పేర్లను ఏపీ సీఐడీ నమోదు చేసింది. వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చినప్పటికీ 2023లో రెండు బేవరేజీలు, మూడు డిస్టిలరీలకు లబ్ది చేకూర్చేందుకు మద్యం పాలసీని మార్చారని అప్పటి ఏబీ బేవరేజెస్ ఎండీ ఫిర్యాదు చేశారు. కొన్ని మద్యం తయారీ సంస్థలకు ప్రయోజనం కలిగేలా 2012 ఎక్సైజ్ పాలసీని మార్చారని .. 2015లో కొత్త ఎక్సైజ్ పాలసీ తీసుకు వచ్చిన ప్రభుత్వానికి పన్నులు రాకుండా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంస్థ ఫిర్యాదు మేరకు ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది.



అయితే అప్పటి , ఇప్పటికి బేవరేజెస్ ఎండీలు.. ఎలాంటి అవకతవకలు జరగలేదని.. ఆధారాల్లేవని చెప్పినట్లుగా తెలుస్తోంది. ఆధారాలు లేని విషయాన్ని సీఐడీ కోర్టుకు తెలిపింది. దాంతో కోర్టు మూసివేసింది. ఇటీవలే చంద్రబాబుపై గత ప్రభుత్వం పెట్టిన ఫైబర్‌నెట్ కేసును కూడా కోర్టు మూసివేసింది. ఈ కేసులో ఎలాంటి అక్రమాలు జరగలేదని, సంస్థకు ఎటువంటి ఆర్థిక నష్టం వాటిల్లలేదని సీఐడీ దర్యాప్తులో తేలింది. ఈ కేసుకు సంబంధించి ఫైబర్‌నెట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. మధుసూదన రెడ్డి, ప్రస్తుత ఎండీ గీతాంజలి శర్మ ఏసీబీ కోర్టుకు హాజరయ్యి.. సీఐడీ సమర్పించిన తుది నివేదికతో తాము పూర్తిగా ఏకీభవిస్తున్నామని, కేసు మూసివేతకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు లిఖితపూర్వకంగా, మౌఖికంగా కోర్టుకు తెలిపారు. దాంతో కేసును కోర్టు మూసివేసింది.

---

# మునుగోడు నియోజకవర్గం లో ఊరి బయటే వైన్ షాపులు

## ఒంటి గంటకే షాపులు ఓపెన్

మునుగోడు డిసెంబర్ 02 (భారత శక్తి): నియోజకవర్గం లో వైన్ షాపుల నిర్వహణ విషయంలో శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనల ప్రకారమే మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు ఊరి బయటే వైన్ షాపులను ఓపెన్ చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే విక్రయాలు మొదలు పెట్టారు.. సాయంత్రం 6 గంటలకు పర్మిట్ రూంలోకి అనుమతిస్తున్నారు..మద్యం షాపులకు కొత్తగా టెండర్లు వేసే సందర్భంలోనే మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం షాపులు దక్కించుకునే యజమానులకు బెల్ట్ షాపులు నిర్వహించొద్దని సిండికేట్ అవ్వకూడదని, ఊరి బయటే మద్యం విక్రయాలు జరపాలని, పర్మిట్ రూంలకు అనుమతించొద్దని పలు సూచనలు చేశారు రాజ్ గోపాల్ రెడ్డి. వీలైతే స్థానికంగా ఉన్న వ్యక్తులే మద్యం టెండర్లు వేసి దక్కించుకునేలా ప్రోత్సహించారు.. మద్యం టెండర్ల డ్రాలో కొన్ని మద్యం షాపులు స్థానికులు మరికొన్ని స్థానికేతరులు దక్కించుకున్నారు.. మునుగోడు నియోజకవర్గంలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులతో హైదరాబాదులోని తన నివాసంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు..

## ఇద్దరు వన్యప్రాణుల వేటగాళ్లు అరెస్ట్...రిమాండ్

సత్తుపల్లి డిసెంబర్ 02 (భారత శక్తి):

సత్తుపల్లి అడవి ప్రాంతంలో వన్యప్రాణాలను వేటగాళ్లు వేటాడుతూ అక్రమ వేట కొనసాగిస్తుండటంతో డీఎఫ్వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఏసీఎఫ్ మంజుల, నేతృత్వంలో జిల్లా టాస్క్ ఫోర్స్ మరియు సత్తుపల్లి అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక దాడి నిర్వహించి విచారణ చేపట్టారు..

టాస్క్ ఫోర్స్ వారి ఆధ్వర్యంలో విచారణను వేగవంతం చేసి వేటగాళ్లు వేటాడిన ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్రమ వేటకు సంబంధించిన ఆధారాలను పొంది నేరస్థలను గుర్తించి అరెస్టు చేసి ఒఉ ఫారెస్ట్ యాక్ట్?1967, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్?1972లోని సంబంధిత విభాగాల కింద వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఒ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, సత్తుపల్లి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్కు తరలించారు.

-----------------

## ట్రావెల్స్ బస్సు బోల్తా ఓ మహిళ మృతి, 10మందికి పైగా గాయాలు

తిరుపతి డిసెంబర్ 02 (భారత శక్తి):

ట్రావెల్స్ బస్సు బోల్తా పడి ఒక మహిళ మృతి చెందింది. పదిమందికి గాయాలయ్యాయి. ఆంధ్ర- కర్ణాటక బార్డర్ లోని శ్రీనివాసపురం తాలూకా రాయల్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచినీళ్ల కోట్ వద్ద ఘటన జరిగింది. కడప నుండి బెంగళూరుకు వెళుతున్న హరిత ట్రావెల్స్ బస్సు డివైడర్ను ఢీకొని బోల్తా పడింది. ప్రొద్దుటూరు కు చెందిన అనిత (58) మృతి చెందింది. పలువురి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో వివిధ ఆస్పత్రులకు తరలించారు,. గాయపడ్డ వారు కడప, రాయచోటి, బెంగుళూరుకు చెందినవారు ఉన్నట్లు సమాచారం. మంగళవారం వేకువ జామున 3 గంటల ప్రాంతంలోజరిగిన ఘటన. తీవ్రంగా గాయపడ్డ పలువురిలో నలుగురిని మదనపల్లె జిల్లా అస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై రాయల్పాడు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

================

## బేకరీలో అగ్ని ప్రమాదం

నర్సీపట్నం డిసెంబర్ 02 (భారత శక్తి):

నర్సీపట్నం మున్సిపాలిటీ శారదా నగర్ లో గల బేకరీలో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు ఫైర్ సిబ్బంది కి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు సమాచారం..బేకరీ పూర్తిగా దగ్ధం కావడంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అమరావతిలో రెండో విడత ల్యాండ్ పూలింగ్, 16,666 ఎకరాలు నోటిఫై చేస్తూ ఉత్తర్వులు

విజయవాడ, డిసెంబర్ 2

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంతంలోని ఏడు గ్రామాలలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 16,666 ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ కోసం నోటిఫికేషన్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అమరావతి మండలంలోని ఐదు గ్రామాలు ఉన్నాయి. అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెద్ద మద్దూరు, ఏంద్రాయి, కర్లపూడి, లెమల్లె గ్రామాల్లో 7,465 ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ చేయనున్నారు. అదే విధంగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని వడ్లమాను, హరిచంద్రపురం, పెద్ద పరిమి అనే మూడు గ్రామాలలో 9,097 ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల చేశారు.ఏపీలోని కూటమి ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ చేపట్టాలన్న ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ గత వారం ఆమోదం తెలిపింది. రెండో దశలో మరో16 వేల ఎకరాల సేకరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ప్రక్రియపై కసరత్తు చేపట్టిన ప్రభుత్వం పూర్తి జాబితా సిద్ధం చేసింది. రాజధాని అమరావతి నిర్మాణానికి మొదటి దశలో ప్రభుత్వ భూమి16 వేల ఎకరాలు సీఆర్డీఏకు అప్పగించారు.

# వైసీపీలోనే ఉంటామంటున్న ఎమ్మెల్సీలు

విజయవాడ, డిసెంబర్ 02 (భారత శక్తి):

వైసీపీ 2024 ఎన్నికల్లో చెలరేగిన పరాజయం తర్వాత, పార్టీలో అసంతృప్తి మొదలైంది. ఈ ఆరుగురు ఎమ్మెల్సీలు 2024-2025 మధ్య కాలంలోనే తమ రాజీనామాలు సమర్పించారు. పార్టీ నిర్వహణలో అసంతృప్తి, వ్యక్తిగత కారణాలు, కూటమి వైపు మొగ్గు చూపడం వంటి కారణాలతో వారు రాజీనా ఇచ్చారు. చైర్మన్ మోషేన్ రాజు ఈ రాజీనామాలను ఆమోదించలేదు. తమ రాజీనామాలు ఆమోదించడం లేదని.. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హైకోర్టుకు వెల్లారు. నవంబర్ 26న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చైర్మన్ మోషేన్ రాజుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జయమంగళ వెంకటరమణ రాజీనామా చేసి ఏడాది గడుస్తున్నా నిర్ణయం తీసుకోకపోవడం అక్రమం, ఏకపక్షపాతం, ప్రక్రియల దుర్వినియోగం గా హైకోర్టు భావించింది. మండలి చైర్మన్‌కు 4 వారాల్లోపు విచారణ పూర్తి చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఈ ఆదేశాలతో ఆరుగురు ఎమ్మెల్సీలు సోమవారం విజయవాడలోని మండలి కార్యాలయంలో చైర్మన్‌ను కలిశారు. వారు వ్యక్తిగతంగా హాజరై, రాజీనామాలు ఆమోదించాలన్నారు. చైర్మన్ మోషేన్ రాజు హైకోర్టు ఆదేశాల ప్రకారం 4 వారాల్లోపు విచారణ పూర్తి చేసి నిర్ణయం తీసుకోవాలి. ఈ ఆరుగురు ఎమ్మెల్సీలు ఇప్పటికి కూటమి పార్టీల్లో చేరిపోయారు. పోతుల సునీత, జకియా ఖానం బీజేపీలో చేరారు. జయమంగళ వెంకటరమణ జనసేన పార్టీలో చేరారు. మర్రి రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ చక్రవర్తి టీడీపీలో చేరారు. వీరి రాజీనామాలు ఆమోదిస్తే.. ఆరు స్థానాలు ఖాళీ అవుతాయి. వాటికి ఉపఎన్నికలు వస్తే వైసీపీ ఒక్క చోట కూడా గెలిచే అవకాశం లేదు. సభలో బలం లేదనందున అన్ని సీట్లు మళ్లీ కూటమి గెలిచే అవకాశం ఉంది. అందుకే వైసీపీకి చెందిన శాసనమండలి చైర్మన్ మోషన్ రాజు ఆమోదించేదుకు ఆలస్యం చేస్తున్నట్లుగా టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

ఆ ఇద్దరు యూ టర్న్

రాజీనామాలు చేసిన ఆరుగురు వైసీపీ ఎమ్మెల్సీల్లో ఇద్దరు వెనక్కి తగ్గుతున్న సూచనలు కనిపిస్తున్నారు. మండలి చైర్మన్ గా కూడా ఉన్న జకియా ఖానం తన రాజీనామ లేఖను ఉపసంహరించుకున్నట్లు శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజుకు చెప్పారు. రాజీనామాపై విచారణకు వచ్చిన ఆమె విచారణలో రాజీనామా ఉపసంహరమ లేఖ రాసి ఇచ్చిన ట్లుగా తెలుస్తోంది. 13 -5-2025 న ఎమ్మెల్సీ పదవికి రాజీనామ చేశారు జకియా ఖానం. పునరాలోచనకు ఛైర్మెన్ మోషేన్ రాజు సమయం ఇవ్వడంతో తాను పునరాలోచన చేసుకున్నానని రాజీనామా లేఖ ఉపసంహరించుకున్నానని చైర్మెన్ మోషేన్ రాజుకు లేఖ ఇచ్చారు. జకియాఖానం నిర్ణయాన్ని ఆమోదిస్తూ ఆమె రాజీనామా లేఖను తిరస్కరించారు. మరో ఎమ్మెల్సీ పోతుల సునీత



విచారణకు హాజరు కాలేదు. పోతుల సునిత విచారణ హాజరు కాకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో టీడీపీలో ఉండే ఆమె.. తర్వాత వైసీపీలో చేరారు. వైసీపీలో పోటీకి అవకాశం రాలేదు. ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. వైసీపీలో ఉన్నప్పుడు చంద్రబాబు కుటుంబంపై అనుచితంగా మాట్లాడటంతో నారా లోకేష్ ఆమెపై పరువు నష్టం కేసులు వేశారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. కానీ టీడీపీలో చేర్చుకోలేదు. దాంతో బీజేపీలో చేరారు. జకియా ఖానం కూడా టీడీపీ అధికారంలోకి వచ్చిన మొదట్లో నారా లోకేష్ ను కలిశారు. కానీ ఆమెను చేర్చుకునే విషయంలో కడప జిల్లా నేతలు అంగీకరించకపోవడంతో పట్టించుకోలేదు. దాంతో ఆమె బీజేపీలో చేరారు. జకియా ఖానం, పోతుల సునీత ఇద్దరూ బీజేపీలో చేరారు. జకియా ఖానం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై, మొదటి ముస్లిం మహిళగా డిప్యూటీ చైర్మన్ పదవిని పొందారు. 2024 అక్టోబర్‌లో తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో విపీ బ్రేక్ దర్శన టికెట్లను బ్లాక్‌మార్కెట్ చేసిన ఆరోపణలతో వచ్చాయి. ఈ కేసులో ఆమె, పీఆర్వో కృష్ణ తేజ, మరొకరి మీద కేసు నమోదైంది. బీజేపీలో చేరిన తర్వాత, ఆమె ప్రధానమంత్రి మోదీ పాలిటిక్స్‌ను ప్రశంసించారు. మోదీ ముస్లిం మహిళలకు సమానత్వం, పేదలకు న్యాయం చేశారు. ఆయన తండ్రి పాత్ర పోషిస్తున్నారు అని చెప్పారు. ఇప్పుడు అనూహ్యంగా ఆమె రాజీనామాపై వెనక్కి తగ్గడంతో వైసీపీలోనే కొనసాగేందుకు నిర్ణయం తీసుకున్నారని అనుకోవచ్చు. జకియా ఖానం ఎమ్మెల్సీగా పదవి కాలం వచ్చే ఏడాది జూలై వరకే ఉంది. అంటే మరో ఏడు నెలలు మాత్రమే ఉంది. ఇప్పుడు రాజీనామా ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం..ఉపఎన్నిక నిర్వహించే అవకాశం లేదు. ఏడాది కిందటే రాజీనామా చేసినపుడు ఆమోదించి ఉంటే మిగతా పదవి కాలం వరకూ ఎన్నిక నిర్వహించేవారు. ఇప్పుడా అవకాశం లేదు. అయితే పోతుల సునీత పదవీ కాలం మాత్రం 2029 వరకూ ఉంది. ఆమె రాజీనామా ఆమోదిస్తే వచ్చే ఉపఎన్నికలో మళ్లీ ఆమెకే చాన్స్ ఇస్తారో లేదోక్లారిటీ లేకపోవడంతో విచారణకు హాజరు కాలేదని తెలుస్తోంది.

## బీజేపీ గూటికి విడుదల రజనీ...



గుంటూరు, డిసెంబర్ 02 (భారత శక్తి):

చిలుకలూరిపేట వైసీపీ ఇంచార్జ్, మాజీ మంత్రి విడదల రజనీ వైసీపీకి గుడ్ బై చెప్పాలని నిర్ణయించుకున్నారని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన చేస్తారని అంటున్నారు. అయితే ఆమె ఏ పార్టీలో చేరుతారన్నదానిపై క్లారిటీ లేదు. గతంలో హడావుడి చేసే ఆమె ఇటీవల రాజకీయంగా సైలెంట్ గా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. విడదల రజనీ గత ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి యాభై వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. అక్కడ అయితే గెలవడం కష్టమని 2019లో తాను పోటీ చేసి గెలిచిన చిలుకలూరిపేట నియోజకవర్గానికే మళ్లీ వచ్చారు. అక్కడ ఏడాదిగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. కానీ ఇటీవల పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి .. గుంటూరు జిల్లాలో ఇంచార్జులను మార్చాని నిర్ణయించుకున్నారు. రేపల్లెలో పార్టీ నేతలు ఎవరూ బలంగా లేకపోవడం, సామాజిక సమీకరణాలతో విడదల రజనీని అక్కడ పని చేసుకోవాలని సూచించారు. విడుదల రజనీ భర్త కాపు సామాజికవర్గం, ఆమె ముదిరాజ్ వర్గానికి చెందిన వారు. ఈ కారణంగా రేపల్లెలో అయితే సామాజికపరంగా కలసి వస్తుందని అక్కడకు వెళ్లి పని చేసుకోవాలని సూచించారు. రేపల్లె వైసీపీ నేత మోపిదేవి వెంకటరమణారావు టీడీపీలో చేరిపోయారు. రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా వదులుకున్నారు. ఆయన మళ్లీ వైసీపీలోకి వచ్చే అవకాశం లేదు. అలాగే గత ఎన్నికల్లో వైసీపీ త రపున పోటీ చేసిన మాజీ మంత్రి ఈపూరి సీతారావమ్మ కుమారుడు ఈపూరి గణేష్ సమర్థంగా పని చేయడం లేదని ఆయన వల్ల కాదని వైసీపీ అధినాయకత్వం క్లారిటీకి వచ్చింది. అందుకే మార్చాలని నిర్ణయించుకుంది.కానీ టీడీపీకి కంచుకోట లాంటి రేపల్లే నియోజవకర్గానికి వెళ్లి తాను మరోసారి రాజకీయంగా బలవడానికి సిద్ధంగా లేనని విడదల రజనీ చెబుతున్నట్లుగా తెలుస్తోంది. చిలుకలూరిపేట నియోజవకర్గంలోనే ఇంచార్జ్ గా కొనసాగిస్తే తాను పార్టీలో ఉంటానని మరోసారి మార్చాలని అనుకుంటే తాను పార్టీ మారిపోతానని ఆమె పార్టీ ముఖ్యులకు సంకేతాలు పంపారు. అయితే పార్టీ నుంచి ఆమెకు ఇంకా సానుకూల స్పందన లేదు. అందుకే ఆమె పార్టీ మారిపోతారన్న లీకులు వస్తున్నాయని చెబుతున్నారు. ఒక వేళ జగన్.. మనసు మార్చుకుని చిలుకలూరిపేట ఇంచార్జ్ గానే కొనసాగాలని ఆఫర్ ఇస్తే.. విడదల రజనీ పార్టీ మారే అవకాశాలు లేవని చెబుతున్నారు. జనసేన, బీజేపీతో .. విడదల రజనీ వర్గీయులు ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లుగా తెలుస్తోంది.

## బంగారం ధరలకు రెక్కలు


ముంబై, డిసెంబర్ 02 (భారత శక్తి):

బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ధరలకు ఎక్కడా బ్రేక్ అనేది పడటం లేదు. రోజూ ఎంతకొంత పెరుగుతూనే సరికొత్త రికార్డులు నమోదు చేస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలతో రేట్లు పెరుగుతూ గోల్డ్ ప్రియులను షాక్‌కు గురి చేస్తున్నాయి. బంగారంతో పాటు వెండి ధరలు కూడా అదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం దాదాపు తులం బంగారం లక్షన్నరకు చేరుకోగా.. సామాన్య, మధ్యతరగతి జనం షాపుల వద్దకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. దీంతో పెళ్లిళ్ల సీజన్ల సమయంలో కూడా బంగారం షాపులు వెలవెలపోయి దర్శనమిస్తున్నాయి. కస్టమర్లు రాకపోవడంతో బంగారం షాపులకు కూడా డిమాండ్ ఉండటం లేదనే చెప్పుకోవాలి. ఈ క్రమంలో బంగారం ధరలపై మరో షాకింగ్ న్యూస్ వచ్చింది. మరికొన్ని వారాల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆరు నుంచి ఏడు వారాల తర్వాత బంగారం ధరలు మరింత చేయనున్నాయని బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత వారం బంగారం ధరలు 3 శాతం పెరిగాయి. ఈ వారం సరికొత్త రికార్డును సృష్టించే అవకాశముందని చెబుతున్నారు. పది గ్రాములకు రూ.5 వేల వరకు పెరగొచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇండియాలో పెళ్లిళ్ల సీజన్‌తో పాటు జూ సెంట్రల్ బ్యాంక్ త్వరలో వడ్డీ రేటును తగ్గించే అవకాశముంది. ఇక రష్యా, నాటో, ఉక్రెయిన్ మధ్య వివాదం ముదురుతోంది. ఈ కారణాలు బంగారం ధరల పెరుగుదలకు దారితీయవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సంవత్సరంలో బంగారం ధరలు 60 శాతం పెరిగాయి. అక్టోబర్ 17న దేశ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. ఈ వారంలో మరింత గరిష్ట స్థాయికి చేరుకునే ఛాన్స్ ఉందని బిజినెస్ వర్గాలు అంచనా కడుతున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే బంగారం ప్రియులకు షాక్‌గా చెప్పుకోవచ్చు.

# పార్లమెంట్ లో రామ్మోహననాయుడు వర్సెస్ మిధున్ రెడ్డి

విజయవాడ, డిసెంబర్ 02 (భారత శక్తి):

అధికారంలో ఉంటే ఏది పడితే అది మాట్లాడితే చెల్లుబాటు అవుతుంది. కానీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదే రివర్స్ అవుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డికిఅటువంటి పరిస్థితి ఎదురయింది. ఈరోజు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం అయ్యాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ఏపీలో జరుగుతున్న పరిణామాలపై మాట్లాడారు. తన సొంత నియోజకవర్గంలో తనకు ఎదురైన పరిణామాలను వివరించారు. ఏపీలో ప్రజాస్వామ్యం లేదని.. ప్రత్యర్థులపై కేసులు, అరెస్టులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో కేంద్రమంత్రికి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీటైన సమాధానం చెప్పారు. జగన్మోహన్ రెడ్డి వైఖరి పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే రామ్మోహన్ నాయుడు ఒక్కసారిగా విరుచుకు పడుతుంటే పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి సైలెంట్ కావాల్సి వచ్చింది. అయితే ఇదే మిధున్ రెడ్డి ఓ ఐదేళ్ల కిందట రామ్మోహన్ నాయుడు విషయంలో వ్యవహరించిన తీరు ఇప్పుడు చర్చకు వస్తోంది. నిండు సభలో సాటి తెలుగు ఎంపీ అని చూడకుండా..



కూర్చోరా భాయ్ నువ్వు మాట్లాడింది చాలు అంటూ ఎగతాళి చేస్తూ మాట్లాడారు. సీన్ కట్ చేస్తే సరిగ్గా ఐదేళ్ల తర్వాత చిన్న వయసులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు ఉండగా? అప్పటికి ఇప్పటికీ అదే ఎంపి స్థానంలో ఉన్నారు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి.ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఆ పార్టీ జైత్రయాత్ర కొనసాగింది. 25 పార్లమెంట్ స్థానాలకు గాను 22 చోట్ల గెలిచింది ఆ పార్టీ. తెలుగుదేశం పార్టీ కేవలం మూడు స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. శ్రీకాకుళం నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, గుంటూరు నుంచి గల్లా జయదేవ్, విజయవాడ నుంచి కేశినేని నాని మాత్రమే తెలుగుదేశం పార్టీ తరపున గెలిచారు. అయితే సభలో ముగ్గురు టిడిపి ఎంపీలు ఉన్న గట్టిగానే వాయిస్ వినిపించేవారు. ముఖ్యంగా శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక వాగ్దాటితో పార్లమెంటులో గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతున్నంత సేపు అధికారపక్షం తో పాటు విపక్షాలు సైతం ఆసక్తిగా గమనించేవి. చివరకు ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఆశ్చర్యంగా చూసేవారు. ఒక విధంగా చెప్పాలంటే రామ్మోహన్ నాయుడు పనితీరును గుర్తించి చిన్న వయసులోనే పౌర విమానయాన లాంటి పెద్ద శాఖను అప్పగించారు. ఒక విధంగా చెప్పాలంటే రామ్మోహన్ నాయుడు గుర్తింపు వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రచ్చగొట్టే ధోరణి ఉంది. ఏపీలో ప్రభుత్వ వైఫల్యాలను ఐదేళ్ల కాలంలో బాగానే ఎండగట్టారు రామ్మోహన్ నాయుడు. రామ్మోహన్ నాయుడు మూడుసార్లు ఎంపీగా గెలిచారు. అదే సమయంలో పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి సైతం రాజంపేట నుంచి వరుసగా హ్యాట్రిక్ విజయం.


**అసాధారణమైన**

పార్ట్-II విభాగం 3 సబ్-సెక్షన్ (ii)

**రైల్వే మంత్రిత్వ శాఖ**

(సౌత్ సెంట్రల్ రైల్వే)

PUB/1518

**నోటిఫికేషన్**

సికింద్రాబాద్, 24 నవంబర్, 2025

S.O. 5388(E). రైల్వే చట్టం, 1989 లోని సెక్షన్ 2 లోని క్లాజ్ (7A) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, కేంద్ర ప్రభుత్వం దిగువ పట్టికలోని కాలమ్ (5) లో పేర్కొన్న అధికారికి, పట్టికలోని కాలమ్ (2) లో పేర్కొన్న విధంగా ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి సమర్థ అధికారి యొక్క విధులను నిర్వహించడానికి, ఆ పట్టికలోని కాలమ్ (3) లో పేర్కొన్న రాష్ట్రంలో అమలు, నిర్వహణ, నిర్వహణ మరియు ఆపరేషన్ కోసం అధికారిక గెజిట్‌లో ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి అమలులోకి వచ్చేలా అధికారం ఇస్తుంది.

పట్టిక

| క్ర. సం. | ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ | రాష్ట్రం | జిల్లా | సమర్థ అధికారి |
|---|---|---|---|---|
| 1 | 3000 మెట్రిక్ టన్నుల లోడింగ్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్‌ను 1x25kV నుండి 2x25KVకి అప్‌గ్రేడ్ చేయడం - గుంతకల్-కడప విభాగంలో ముద్దనూరు TSS నిర్మాణం. | ఆంధ్రప్రదేశ్ | వైఎస్ఆర్ కడప | రెవెన్యూ డివిజనల్ అధికారి, జమ్మల మడుగు |

[F.No.W.Con.182/SRP/TSS/MOO]

A 1925

మోహిత్ వర్మ, ఛీఫ్ ఇంజనీర్ / Con-1

# కొత్త స్ట్రాటజీలో వైసీపీ

కాకినాడ, డిసెంబర్ 02 (భారత శక్తి):

వచ్చే ఎన్నికలే ధ్యేయంగా రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. అవి చేయని ప్రయత్నం అంటూ లేదు. తెలుగుదేశం పార్టీ కూటమిలో జనసేన, బిజెపి ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే ఉంది. టిడిపి కూటమికి కాపులతో పాటు కమ్మ సామాజిక వర్గం అండగా ఉంది. మొన్నటి ఎన్నికల్లో బీసీలు సైతం అండగా నిలవడంతో కూటమి ఘనవిజయం సాధించింది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గంతో పాటు దళిత ఓటు బ్యాంకు ఉంది. అయితే ఆ రెండు సామాజిక వర్గాల్లో సైతం మొన్నటి ఎన్నికల్లో చిన్నపాటి చీలిక వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయానికి కూడా అది ఒక కారణం. అయితే ఏపీలో పెద్ద సామాజిక వర్గంగా ఉన్న కాపులు ఎవరికి మద్దతు తెలిపితే వారే విజయం సాధిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు అదే కాపు సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కాపుల్లో చీలిక తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని భావిస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే దళిత కార్డు ఒకటి బయటకు వచ్చింది. కాపులు, దళితులు కలిస్తే రాజ్యాధికారం తప్పకుండా లభిస్తుందని దళిత వర్గానికి చెందిన ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్ చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు దారితీస్తోందిదళిత మహాసభల కు సంబంధించిన కార్యక్రమం ఒకటి జరిగింది. అందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐపీఎస్ సునీల్ కుమార్ కాపులతో దళితులు చేతులు కలపాలని.. అప్పుడే కాపులకు దూరమైన రాజ్యాధికారం దక్కుతుందని ఆయన వ్యాఖ్యలు చేశారు. పనిలో పనిగా డిప్యూటీ సీఎం పదవిని జడ శ్రావణ్ కుమార్ లాంటి నేతలు తీసుకోవాలని చెప్పడం ద్వారా అసలు విషయాన్ని చెప్పేసారు. గత కొద్ది రోజులుగా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు జడ శ్రవణ్ కుమార్. 2024 ఎన్నికలకు ముందు శ్రావణ్ కుమార్ తెలుగుదేశానికి అనుకూలంగా ఉండేవారు. కానీ ఎన్నికల్లో సరైన ప్రాధాన్యం, ఆపై తాను కోరిన వారికి సీట్లు ఇవ్వకపోవడంతో శ్రవణ్ కుమార్ లో మార్పు వచ్చింది. క్రమేపి ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. మరోవైపు సునీల్ కుమార్ సైతం వైసీపీ హయాంలో ఇంటలిజెన్స్ ఐజిగా పనిచేశారు. అప్పట్లో టిడిపి కూటమి నేతలను వేధించారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే సునీల్ కుమార్ నోటి నుంచి కాపులు, దళితులు కలవాలన్న కామెంట్ రావడం.. జడ శ్రవణ్ కుమార్ ప్రస్తావన రావడంతో దాని వెనుక వైసీపీ ప్రయోజనాలు ఉన్నాయని అర్థమవుతోంది.కూటమికి అండగా ఉన్నారు కాపులు. గత కొద్ది రోజులుగా కాపు సామాజిక వర్గం విషయంలో కమ్మ సామాజిక వర్గం దాడులకు తెగబడుతోందని వైసీపీ ప్రచారం చేసుకుంటూ వస్తోంది. కాపులకు సంబంధించిన ఏ అంశం బయటకు వచ్చిన దానిని తెర పైకి తెనస్తూ రాజకీయ ప్రయోజనాలను దక్కించుకోవాలని ఉబలాటపడుతోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే ఇప్పుడు దళిత కార్డును ఉపయోగించి? కాపుల్లో చీలిక తెచ్చే ఆలోచనలో ఉన్నట్టు కనిపిస్తోంది. లేకుంటే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దళితులు అండగా ఉంటూ వచ్చారు. వారిలో సైతం మార్పు కనిపిస్తోంది. ఇంకో వైపు చూస్తే కాపులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్మేస్థితిలో లేరు. అందుకే కూటమితో పాటు జనసేనకు అండగా నిలిచే కాపులను డైవర్ట్ చేస్తే.. మిగతా వర్గాలతో ఈజీగా అధికారంలోకి రావచ్చు అని జగన్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే కుల సమీకరణలతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తూ వచ్చింది. టిడిపి హయాంలో ఉన్న కాపు రిజర్వేషన్ ఉద్యమం వైసీపీ రాగానే ఆగిపోయింది. ఇప్పుడు చూస్తుంటే కాపులతో దళితులు చేతులు కలపాలి అన్న డిమాండ్ వచ్చింది. మొత్తానికి అయితే జగన్ గట్టి ప్లానే వేసినట్లు తెలుస్తోంది. మరి అది వర్కౌట్ అవుతుందా? లేదా? చూడాలి.

# ప్రతీఒక్కరి ఫోన్లలో సంచార్ సాథీ యాప్

ముంబై, డిసెంబర్ 02 (భారత శక్తి):




భారత్‌లో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా.. కేంద్రం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఇవి తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా రోజూ వందలమంది సైబర్ ఫ్రాడ్స్ ఉచ్చులో పడి మోసపోతున్నారు. లక్షల రూపాయల డబ్బులను పోగొట్టుకుంటున్నారు. రోజుకో కొత్త రూపంలో ప్రజలను బుట్టలో వేసుకుని చాలా స్మార్ట్‌గా మోసానికి పాల్పడుతున్నారు సైబల్ క్రిమినల్స్. మెట్రో సిటీలలో ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సైబర్ క్రైమ్ పోలీసులు నేరగాళ్లను పట్టుకుని కొంతమందికి డబ్బులు తిరిగివచ్చేలా చేస్తుండగా..నిందితులను గుర్తించలేక మరికొంతమందికి తిరిగి రావడం లేదు. దేశంలో ఇలాంటి పరిస్థితులే నెలకొనగా.. దీనికి చెక్ పెట్టేందుకు కేంద్రం కొత్త ఆలోచన కనిపెట్టింది.ఇకపై కొత్త మొబైల్ ఫోన్లలో డిఫార్ట్‌గా కేంద్ర ప్రభుత్వ 'సంచార్ సౌథీ' యాప్ తప్పనిసరిగా ఉండేలా చేయాలని స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలతో పాటు టెలికాం కంపెనీలకు టెలికాం మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే తయారై మార్కెట్లోకి లాంచ్ కానున్న ఫోన్లలో కూడా డీఫాల్ట్‌గా యాప్ రావాలని, అది డిలీట్ చేయడానికి వీలుకాకుండా ఉండాలని సూచించింది. ఈ మేరకు యాప్ ఇన్‌స్టలేషన్ కోసం టెలికాం, మొబైల్ తయారీ కంపెనీలకు 90 రోజుల గడుపు ఇచ్చింది. అయితే థర్డ్ పార్టీ యాప్‌లను ముందుగా ఇన్‌స్టాల్ చేయడానికి ఎప్పటినుంచో యాపిల్ వ్యతిరేకత చూపిస్తోంది. దీంతో కేంద్ర కొత్త నిర్ణయాన్ని యాపిల్ వ్యతిరేకించే అవకాశముందని తెలుస్తోంది. యాపిల్ ఒప్పుకోకపోతే కేంద్రం ఎలా స్పందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.సైబర్ నేరాలు, ఫోన్ల చోరీకి అడ్డుకట్ట వేసేందుకు ఈ ఏడాది జనవరిలో కేంద్రం సంచార్ సౌథీ యాప్‌ను ప్రవేశపెట్టింది. మొబైల్ చోరీకి గురైతే ఇందులోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా పోగొట్టుకున్న పనిచేయకుండా బ్లాక్ చేయడం, ఐఎంఈఐని వెరిఫై చేసుకోవడం, ఫోన్ పోతే ఫిర్యాదు చేయడం. మీ పేరుపై ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయే తెలుసుకోవడం వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చోరీకి గురైన 7 లక్షల మంది ఫోన్లను కేంద్రం గుర్తించింది. ఇక ఐఎంఈఐ నెంబర్ల ట్యాపరింగ్‌కు పాల్పడుతున్న ఘటనలు కూడా ఎక్కువైపోయాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ప్రతీ ఫోన్‌లో సంచార్ సౌథీ యాప్ ఉండాలని కేంద్రం భావిస్తోంది.

# కల్తీనెయ్యి... పరకామణి.. నెక్ట్స్ ఎవరంటూ తీవ్ర చర్చ

తిరుమల, డిసెంబర్ 02 (భారత శక్తి):

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కథ తెల్చే పనికి వేళయింది. కల్తీ నెయ్యి కేసు నిజాలు తేల్చే పనిలో ఉన్న సిట్ ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయబోతోంది. ఇప్పటికే 29 మంది నిందితులను కేసులో చేర్చి పలువురిని విచారించిన సిట్ 9 మందిని అరెస్టు చేసింది. మరికొద్ది మందిని నిందితులుగా చేర్చేందుకు మెమోలు దాఖలు చేసింది. అంతేకాకుండా.. గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్ గా, ఈఓలుగా పనిచేసిన వారిని విచారించింది. డెయిరీ యాజమాన్యాలను, నిందితులను జైలుకు పంపింది. ఇప్పుడు టిటిడి అధికారుల అరెస్టులకు సిద్ధం కావడం.. ఇన్వెస్టిగేషన్ స్పీడ్ అవ్వడంతో.. ఉద్యోగుల్లో భయాందోళనలకు కారణం అయ్యింది. నెక్స్ట్ ఎవరంటూ తీవ్ర చర్చ జరుగుతోంది.దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసు విచారణ తుది దశకు చేరుకుంది. ఔఆఆః కాఫ్ నివేదిక ఆధారంగా నెయ్యిలో కల్తీని గుర్తించిన టిటిడి శ్రీవారి భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న అభియోగాలు, ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చే పనిలో ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తోంది. సీబీఐ నేతృత్వంలోని 5 మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం డిసెంబర్ 15 లోపు ఫైనల్







ఉన్న ఉద్యోగులను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని బావిస్తున్న పరిస్థితి వెంటాడుతోంది. అంతేకాకుండా.. పలువురిని విచారించే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం..సుబ్రహ్మణ్యం రిమాండ్ రిపోర్టులో కల్తీ నెయ్యి సరఫరాపై సంచలన విషయాలు బయటపడ్డాయి. కల్తీ నెయ్యిని స్వచ్ఛమైన ఆవు నెయ్యిగా టీటీడీకి సరఫరా జరిగేలా సహకరించింది సుబ్రహ్మణ్యమే నని సిట్ రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. బోలే బాబా డయిరీ నుంచి రూ. లక్షల్లో లంచం, విలువైన కానుకలు సుబ్రహ్మణ్యం అందుకున్నట్లు సిట్ నిర్ధారణకొచ్చింది.బోలే బాబా, వైష్ణవి డయిరీలను తనిఖీ చేయడానికి వెళ్లిన అధికారులు విలువైన వస్తువులు, నగదు పొందినట్లు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసింది. కేసులో ం24 గా ఉన్న చిన్నఅప్పన్న కు సహకరించి నెయ్యి సప్లై చేసిన కంపెనీలతో సుబ్రహ్మణ్యంతో పాటు మరికొందరు లాలూచీ పడినట్లు సిట్ గుర్తించింది. మైసూర్ ల్యాబ్ రిపోర్టును దాచి బోలే బాబా డయిరీకి రెండు దఫాల్లో దాదాపు 1.20 లక్షల కిలోల దాకా నెయ్యి సరఫరాకు ఆర్డర్ల ను ఇవ్వడంలో సుబ్రహ్మణ్యం కీలకపాత్ర పోషించినట్లు సిట్ తెలిపింది. నెయ్యి సరఫరాకు సాంకేతికంగా అర్హత పొందిన సంస్థలకు లబ్ధి చేకూర్చేలా టెండర్ల ప్రక్రియను నిర్వహించేలా అప్పటి టిటిడి ప్రొక్యూర్మెంట్ జిఎం సుబ్రహ్మణ్యం ప్రయత్నించినట్లు సిట్ పేర్కొంది.మరోవైపు కల్తీ నెయ్యి కేసు దర్యాప్తును ముగించే దశలో ఉన్న సిట్ టిటిడి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాదులో, టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డిని తిరుపతిలో రెండు రోజులు పాటు విచారించింది. ఇలా కల్తీ నెయ్యి సరఫరా కేసులో అప్పటి పాలకమండలిని, అధికారులను, నెయ్యి సరఫరా చేసిన సంస్థల ప్రతినిధులను, సహకరించిన వారిని విచారించింది. అయితే టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో ఉద్యోగుల పాత్ర కూడా కీలకమని సిట్ విచారణలో తేరడంతో ఇప్పుడు కొందరు ఉద్యోగుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఈ నేపథ్యంలోనే ం24 నుంచి ం36 వరకు మరో 12 మంది నిందితులను కేసులో చేర్చేందుకు సిట్ సిద్ధమైంది. ఈ మేరకు నెల్లూరు కోర్టులో మెమో దాఖలు చేసింది.నిందితుల్లో 7 మంది టిటిడి ఉద్యోగులు తోపాటు 5మంది డయిరీ లకు చెందిన వారుగా పేర్కొన్న సిట్ అధికారులు.. 2019 నుంచి టిటిడి ప్రొక్యూర్మెంట్ జనరల్ మేనేజర్ లుగా, వేర్ హౌసింగ్, గోశాల డయిరీ ఉద్యోగులు గా పనిచేసిన వారిని నిందితులుగా తేల్చింది. డెయిరీ శాంపిల్స్ సేకరించి నిపుణుల నివేదిక ఇవ్వాలని 2022 మే నెలలో అప్పటి టిటిడి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశించగా ఇదే అదునుగా అక్రమాలు జరిగినట్లు సిట్ భావిస్తోంది.. 2018 నుంచి 2024 వరకు నెయ్యి సరఫరా చేసిన డయిరీ ప్లాంట్ సందర్శించిన నిపుణులు కమిటీ నివేదికను, ల్యాబ్ రిపోర్టులను పక్కన పెట్టి ఇదే అవకాశంగా చేసుకుని కొందరు డయిరీ యాజమాన్యాల నుంచి ముడుపులు, కానుకలను పొందినట్లు సిట్ తేల్చింది. ఇలా కక్కుర్తి పడ్డ వారిలో నిపుణులు, టిటిడి ప్రొక్యూర్మెంట్ జీఏంలు, కొందరు ఉద్యోగులు ఉన్నట్లు సిట్ ఛార్జ్ షీట్ కూడా వేయబోతుండటం సంచలనంగా మారింది.

# ఫుట్ బాల్ ప్రాక్టీస్‌లో రేవంత్...

హైదరాబాద్, డిసెంబర్ 02 (భారత శక్తి):




తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో జరగనున్న ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం ఉప్పల్‌లో సీరియస్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. డిసెంబర్ 13న ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగే 'గోట్ కప్' ఫ్రెండ్లీ మ్యాచ్‌లో సీఎం తన జట్టుతో కలిసి మెస్సీ టీమ్‌తో పోటీపడనున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఫుట్ బాల్ అంటే చాలా ఇష్టం. గతంలో కూడా..ఆయన హెచ్ సీయూ స్టూడెంట్స్ తో కలిసి ఫుట్ బాల్ ఆడిన సందర్భాలు ఉన్నాయి. వివిధ మైదానాల్లో ఆటవిడుపుగా ఫుట్ బాల్ ఆడారు. ఇప్పుడు ఏకంగా మెస్సీతో కలిసి ఆడే అవకాశం రావడంతో మరింత చురుగ్గా ప్రాక్టీస్ చేస్తున్నారు. గోట్ ఇండియా టూర్' భాగంగా ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. మెస్సీ టీంతో తలపడే జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ కెప్టెన్సీ వహించే అవకాశం ఉంది. ప్రభుత్వ స్కూల్స్‌కు చెందిన ఫుట్ బాల్ ప్లేయర్లు రేవంత్ టీంలో ఆడనున్నారు. ఆర్ఆర్ 9 జెర్సీతో సీఎం బరిలోకి దిగనున్నారు. ఎంతో బిజీ ఉన్నప్పటికీ ఈ మ్యాచ్ కోసం సీఎం రేవంత్ ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నారు. ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న సీఎం రేవంత్ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అలాగే ఈ ఫోటోలను కాంగ్రెస్ శ్రేణులు, రేవంత్ అభిమానులు షేర్ చేస్తున్నారు.ఫుట్‌బాల్ ఇష్టపడే సీఎం రేవంత్ రెడ్డి, తన వర్క్ షెడ్యూల్‌లో రాత్రి సమయాల్లో కూడా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో స్థానిక ఫుట్‌బాల్ ఆటగాళ్లతో కలిసి ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ 14 సంవత్సరాల తర్వాత ఇండియాను మళ్లీ సందర్శిస్తున్నాడు. ఊాయి ఇండియా టూర్ 2025 పేరిట డిసెంబర్ 13 నుంచి 15 వరకు నాలుగు నగరాల్లో ఈ టూర్ జరగనుంది. ఫుట్‌బాల్, సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యాన్ మీటింగ్‌లతో కూడిన ఈ ఈవెంట్ బిజీగా సాగనుంది. మెస్సీ టూర్ డిసెంబర్ 13న కోల్‌కతాలో ప్రారంభమై, హైదరాబాద్, ముంబై, ఢిల్లీలో జరిగి ముగుస్తుంది. ఇది ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, కాన్సర్ట్‌లు, చారిటీ ఈవెంట్‌లు, మీట్-అండ్-గ్రీట్ సెషన్‌లతో కూడిన మల్టీ-సిటీ ఫెస్టివల్ వంటివి ఉంటాయి. టికెట్లు జొమాటో డిస్ట్రిక్ట్ యాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. మెస్సీ డిసెంబర్ 12న కోల్‌కతాలో ల్యాండ్ అవుతాడు. 2011 తర్వాత మెస్సీ మొదటి ఇండియా సందర్శన. ఈ టూర్‌కు కారణం 2025 దుర్గా పూజల్లో కోల్‌కతాలో మెస్సీ స్టాచ్యూ ఏర్పాటు. ప్రమోటర్ సతద్రు దత్తా 8 నెలలు ప్రయత్నించి మెస్సీ, అతని తండ్రి జార్జ్‌తో సమావేశమై, ఫిబ్రవరి 2025లో ఫైనల్ ప్లాన్ ఆమోదించారు.

# హైదరాబాద్ సిటీపై కోకాపేట ఎఫెక్ట్

## సొంత ఇంటి కలగా మారుతున్న వేళ

హైదరాబాద్, డిసెంబర్ 02 (భారత శక్తి):

హైదరాబాద్‌లో ఇప్పుడు ఔటర్ రింగ్ రోడ్ సమీపానికి వెళ్లి ఓ 1000 ఎస్ఎఫ్టీ అపార్టుమెంట్ కొనుక్కోవాలంటే కనీసం కోటి రూపాయలు అవుతోంది. ఇక స్కై స్క్రాపర్లలో అయితే కనీసం రెండు కోట్లు అవుతోంది. ఓ మధ్యతరగతి జీవి .. కోటి పెట్టి ఇల్లు కొనగలరా?. రూ. 50 లక్షలు అయితేనే జీవితాంతం ఈఎంఐ కట్టుకుంటూ ఓ ఇల్లు కొనగలరు?. అలాంటి పరిస్థితుల్లో భూముల రేట్లను వేలం పెట్టి మరీ రికార్డుల మీద రికార్డులు సృష్టించే దిశగా అమ్ముతూంటే.. ఇక మధ్యతరగతికి అందుబాటులో ఇళ్ల ఉంటాయా?ప్రభుత్వం కోకాపేట్‌లో భూములు వేలం వేస్తోంది. ఒక్క ఎకరానికి 150 కోట్లు దాటిపోతోంది. ఈ ధరలు చూస్తుంటే సామాన్యులకు ఇల్లు కొనడం కలలా మారిపోయింది. ఈ వేలాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బాగా లాభం చేస్తున్నాయి. బడా రియల్ ఎస్టేట్ సంస్థలు భూములు కొని లగ్జరీ ఫ్లాట్లు కడుతున్నాయి. కోకాపేటలో ఒక్కో ఫ్లాట్ 4 నుంచి 10 కోట్ల వరకు ఉంటుంది. ఈ ఫ్లాట్లు కొనేవాళ్లు కేవలం బాగా సంపాదించే వాళ్లే. కోకాపేట్ ధరలు పెరిగితే దాని పక్కనే ఉన్న మణికొండ, నర్సింగి, గచ్చిబౌలి ధరలు కూడా పెరుగుతాయి. ఆ తెల్లాపూర్, ఆ తర్వాత కొల్లూరు వరకూ ఇప్పుడు మధ్యతరగతి వాళ్లు హైదరాబాద్‌లో ఇల్లు కొనాలంటే కనీసం 1.5 నుంచి 2 కోట్లు కావాలి. ప్రభుత్వానికి వేలం ద్వారా వేల కోట్లు వస్తున్నాయి. ఆ డబ్బుతో రోడ్లు, మెట్రో విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు చేస్తామని అంటోంది. కానీ పథకాల అమలు కోసమే అని అందరికీ తెలుసు. ఇప్పుడు హైదరాబాద్‌లో రెండే రకాల ఇళ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి ? చాలా ఖరీదైన లగ్జరీ ఫ్లాట్లు, లేదా నగరం బయట చాలా దూరంలో ఉండే చిన్న ఫ్లాట్లు. మధ్యలో మధ్యతరగతి వాళ్లకు తగిన ఇళ్లు దాదాపు లేవు. గతంలో బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్ మాత్రమే ఖరీదుగా ఉండేవి. ఇప్పుడు కోకాపేట్, గచ్చిబౌలి కూడా అలాంటి స్థాయికి వచ్చేశాయి. ఇక హైదరాబాద్ నగరం మొత్తం మధ్యతరగతి వారికి ఇల్లు లేదు అన్నట్టు మారిపోతోంది. ప్రభుత్వం ఇలాగే వేలాలు పెడుతూ పోతే రేపు మధ్యతరగతి వాళ్లు నగరం బయటకు వెళ్లిపోవాల్సి వస్తుంది. లేదా ఇల్లు కొనే కలనే వదులుకోవాల్సి వస్తుంది. డబ్బు ఉన్నవాళ్లకు హైదరాబాద్ స్వర్గం అయిపోతోంది. డబ్బు లేని వాళ్లకు ఇక్కడ స్థలం లేకుండా పోతోంది.ప్రభుత్వం ఆదాయం మాత్రమే చూసుకుంటోంది. వేలం వల్ల ఏర్పడే సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పును ఊహించడం లేదు. కొంత మంది బిల్డర్లు భారీగాఖర్చు పెట్టి భూములు కొనుగోలు చేయడం వల్ల ఆ ప్రభావం హైదరాబాద్ మొత్తం పడుతుంది. రియల్ ఎస్టేట్ భూమ్ ఉందని చెప్పి అన్ని చోట్లా ధరలు పెంచుతారు. గత కొంత కాలంగా ఇదే జరుగుతోంది. చిన్న బిల్డర్లు.. ఏ సౌకర్యాలు లేని అపార్టుమెంట్లలోనే ఇప్పుడు డబుల్ బెడ్ రూం 70 లక్షలకు అమ్ముతున్నారంటే.. ఇక సామాన్యుడు ఎలా సొంత ఇంటి కలను నిజం చేసుకోగలడు. హైదరాబాద్‌లో ఒక్క ఐటీ వర్గం... అది కూడా ఉన్న వైట్ కాలర్ జాబ్స్ చేసే వారికి మాత్రమే ప్రస్తుతం ఇళ్ల కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. వారి డిమాండ్ పరిమితం. త్వరలో ఈ బూమ్ బద్దలయ్యే అవకాశం ఉంది. మరో వైపు మధ్యతరగతికి అందుబాటు ధరల ఇళ్లను నిర్మించడానికి సిద్ధమే కానీ.. భూమి తక్కువ ధరకు ప్రభుత్వం ఇస్తే చాలని అంటున్నారు. వందల కోట్లు పెట్టి భూమి కొని.. తక్కువ ధరలకు ఎలా అమ్ముతామని ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వం ఆదాయం కోసమే వేలం వెర్రిగా భూములను వేలం వేస్తే.. ఆ ప్రభావం మధ్యతరగతిపై ఎక్కువగా పడుతోంది. దీనికి పరిష్కారాన్ని ప్రభుత్వం కూడా ఆలోచించాల్సిందే.

# ఔటర్ రింగు రోడ్డు వరకు సిటీనే...

హైదరాబాద్, డిసెంబర్ 02 (భారత శక్తి):

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిని విస్తరించి, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు నవంబర్ 25న జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశంలోనూ ఈ అంశాన్ని టేబుల్ ఎజెండాగా పెట్టి ఆమోదించారు. అయితే, కాగితంపై ఈ నిర్ణయం ఎంత అద్భుతంగా కనిపిస్తుందో.. ఆచరణలో దీని వెనుక అంతటి కఠినమైన సవాళ్లు ఉన్నాయన్నది పాలనా నిపుణుల మాట. అసలు ప్రభుత్వం ఎందుకు ఈ నిర్ణయం తీసుకుంది.. దీని వల్ల సామాన్యుడికి ఒరిగేదేంటి..? క్షేత్రస్థాయిలో ఎదురయ్యే చిక్కుముడులేంటి..? జీహెచ్ఎంసీని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యం వినడానికి బాగానే ఉన్నా.. ఆచరణ లో మాత్రం అడుగడుగునా సవాళ్లు ఎదురుకానున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం కోటికి పైగా జనాభా ఉంది. విస్తరణ తర్వాత 2 కోట్లకు పెరగనుంది.అంటే రాష్ట్ర మొత్తం జనాభాలో దాదాపు సగం జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధి ప్రస్తుతం 650 చదరపు కిలోమీటర్లు. విస్తరణ తర్వాత దాదాపు 2,735 చదరపు కిలోమీటర్ల వరకు ఉండనుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ వార్షిక బడ్జె ట్ 8 వేల కోట్లు దాటగా.. విస్తరణ తర్వాత రూ.15 వేల కోట్లు దాటే అవకాశాలున్నా యి. విలీనం జరిగితే ప్రభుత్వం ముందుకు వచ్చే అత్యంత క్లిష్టమైన సమస్య సిబ్బంది కొరత. ప్రస్తుతం 650 చ.కి.మీ పరిధిలో ఉన్న జీహెచ్ఎంసీనే సిబ్బంది కొరతతో అల్లాడుతోందిపారిశుధ్య కార్మికులు, దోమల నివారణ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే చెత్త సేకరణ, రోడ్ల నిర్వహణ కష్టంగా ఉంది. ఇప్పుడు అదనంగా 1400 చ.కి.మీ విస్తీర్ణం వచ్చి చేరితే.. ఈ సమస్యలను ఎలా పర్యవేక్షిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కొత్తగా వేలసంఖ్యలో ఉద్యోగులను నియమించే ఆర్థిక స్తోమత ప్రభుత్వానికి ఉందా అన్నది ప్రశ్నార్థకమే. సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించినా, వారి జీతభత్యాలు తడిసి మోపెడవుతాయి.సిబ్బందిని పెంచకుండా విలీనం చేస్తే.. అటు నగరంలో నూ, ఇటు శివార్లలోనూ సేవలు పడకేసే ప్రమాదం ఉంది. శివారు ప్రాంతాల్లో ఇంకా చాలా చోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు. సెప్టిక్ ట్యాంకులపైనే ఆధారపడుతున్నారు. జీహెచ్ఎంసీలో కలిపాక వాటన్నిం టికీ డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వాలంటే వేల కోట్లు ఖర్చవుతుంది. అలాగే మంచినీటి సరఫరా కోసం



జలమండలి తన నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించాలి. ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్లు శివా రు కాలనీల దాహార్తిని తీర్చలేకపోతున్నాయి.ప్రభుత్వం ప్రస్తుతం పన్నులు పెంచబోమని చెబుతున్నప్పటికీ.. ఏకీకృత పాలన వ చ్చాక పన్నుల ఏకీకరణ తప్పనిసరి అవుతుం ది. ప్రస్తుతం చిన్న మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను తక్కువగా ఉంది. జీహెచ్ఎంసీలో విలీనమైతే.. నగరంతో సమానంగా కాకపోయి నా, ప్రస్తుతం ఉన్నదాని కంటే కచ్చితంగా పన్నులు పెరుగుతాయి. చెత్త సేకరణ ఛార్జీ లు, నీటి బిల్లులు, నాలా పన్ను వంటివి అదనపు భారం కావచ్చు. ఇది మధ్యతరగతి ప్రజ లకు ఆందోళన కలిగించే అంశం. 2007లో అప్పటి ప్రభుత్వం 12 మున్సిపాలిటీలను కలిపి జీహెచ్ఎంసీని ఏర్పాటు చేసింది.అల్వాల్, ఉప్పల్, కాప్రా, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ వంటి ప్రాంతాలు నగ రంలో కలిశాయి. విలీనమై 17 ఏళ్లు గడిచినా .. మల్కాజ్‌గిరి, ఉప్పల్, కాప్రా వంటి ప్రాంతాల్లో నేటికీ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్లు మునిగిపోతున్నాయి. అంటే, కేవలం విలీనం చేసినంత మాత్రాన అభివృద్ధి జరగదని తేటతెల్లమైంది. సరైన ప్రణాళిక, సరిపడా నిధులు లేకుండా విలీనం చేస్తే.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లు అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, ఈసారి పక్కా ప్రణాళికతో వెళ్తేనే ఫలితం ఉంటుందని వారు చెబుతున్నారు.విలీన నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి మాత్రం పెద్ద వరంగా మారనుంది. జీహెచ్ఎంసీ లిమిట్స్ అనే ట్యాగ్ పడితే చాలు.. భూముల రేట్లు అమాంతం పెరుగుతాయి. పెద్దఎత్తున వెంచర్లు, హైరైజ్ అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు వస్తాయి. బిల్డింగ్ పర్మిషన్లు సులభతరం అయితే ద్వారా నిర్మాణ రంగం ఊపందుకుంటుంది. రిజిస్ట్రేషన్లు, బిల్డింగ్ పర్మిషన్ల ద్వారా ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతుందిఅయితే, ఓఆర్ఆర్ లోపల ఇంకా వందలాది గ్రామాలు, వ్యవసాయ భూములు ఉన్నాయి. విలీనంతో ఈ ప్రాంతాల్లో పట్టణీకరణ వేగవంత మై.. గ్రామీణ సంస్కృతి, వ్యవసాయం పూ ర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురై కాంక్రీట్ జంగిల్స్‌గా మారే ముప్పు లేకపోలేదు. హై డ్రా వంటి సంస్థలు ఉన్నా.. రియల్ మాఫియాను అడ్డుకోవడం సవాలే.జీహెచ్ఎంసీ విస్తరణ అనేది కాలగమనంలో జరగాల్సిన పరిణామమే. అంతర్జాతీ య నగరంగా ఎదగాలంటే ఇది అవసరం. కానీ, ఇది కేవలం సరిహద్దులు మార్చే ప్రక్రియగా మిగిలిపోకూడదు. సామాన్యుడికి మెరుగైన జీవన ప్రమాణాలు, నాణ్యమైన రోడ్లు, స్వచ్ఛమైన నీరు, కాలుష్యరహిత వా తావరణం అందించినప్పుడే ఈ మెగా సిటీ కల సాకారం అవుతుంది. లేదంటే, సమస్య ల చదరంగంలో హైదరాబాద్ మరో క్లిష్టమైన పరిస్థితిలో బందీ అవుతుంది. బ్రాండ్ హైదరాబాద్ ఇమేజ్ పెంచే క్రమంలో.. బస్తీవాసుల బతుకులు చిత్రవధ కాకుండా చూ డాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.విలీనమవుతున్న 27 మున్సిపాలిటీల్లో ఆర్థికంగా భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. ము న్సిపాలిటీలుగా మణికొండ, నార్సింగి, కొం పల్లి, బండ్లగూడ జాగీర్, తెల్లాపూర్ వంటివి రియల్ ఎస్టేట్ బూమ్‌తో కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అక్కడ మౌలిక వసతులు కొం త మెరుగ్గా ఉన్నాయి. పూర్ మున్సిపాలిటీలుగా జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగా రం, తుక్కుగూడ, జల్‌పల్లి వంటి మున్సిపాలిటీలు ఆదాయం లేక, కనీస రోడ్లు, డ్రైనేజీ లేక సతమతమవుతున్నాయిఅయితే ధనవంతులైన మున్సిపాలిటీల నుంచి వచ్చే మి గులు ఆదాయాన్ని, పేద మున్సిపాలిటీల అభివృద్ధికి మళ్లించే అవకాశం ఉంది. దీనివల్ల సమతూకం వస్తుందని ప్రభుత్వం భావి స్తోంది. మణికొండ, నార్సింగి వాసులు తమ పన్నుల డబ్బు తమ ప్రాంత అభివృద్ధికి కా కుండా వేరే చోటికి మళ్లిస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇది భవిష్యత్తులో స్థానికంగా అసంతృప్తికి దారితీయవచ్చు.భవిష్యత్ పరిపాలన ఎలా ఉండాలి?.. విలీనం విజయవంతం కావాలంటే ప్రభు త్వం ఈ కింది చర్యలు తప్పక తీసుకోవాలని పట్టణ ప్రణాళిక నిపుణులు సూచిస్తున్నా రు. మొత్తం నగరాన్ని ఒకే కమిషనర్ పాలించడం అసాధ్యం. ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 10- నుంచి 12 జోన్లకు పెంచాలి. జోనల్ కమిషనర్లకు పూర్తి ఆర్థిక, పరిపాలన అధికారాలు ఇవ్వాలి. చిన్న చిన్న సమస్యలకు హెడ్ ఆఫీస్ చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు.విలీన ప్రాంతాల అభివృద్ధికి వచ్చే ఐదేళ్ల పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. కేవలం అక్కడి పన్నుల ఆదాయంపైనే ఆధారపడకుండా.. ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో నిధులు ఇవ్వాలి.యుద్ధ ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయాలి. ప్రతి 500 ఇళ్లకు ఒక పారిశుధ్య కార్మికుడు ఉండేలా చూడాలి. ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న గ్రోత్ కారిడార్లలో ప్రజా రవాణాను మెట్రో, బస్సులు విస్తరించాలి. లేదంటే ట్రాఫిక్ సమస్యలు నరకప్రాయంగా మారుతాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ భారీ నిర్ణయం వెనుక ప్రధానంగా మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. సమగ్ర అభివృద్ధి ప్రస్తుతం కోర్ సిటీ పాత ఎంసీహెచ్ ఒకలా, విలీన ప్రాంతాలు మరోలా, శివారు మున్సిపాలిటీలు ఇంకోలా అభివృద్ధి చెందుతున్నాయిఒక రోడ్డు వేయాలన్నా, డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలన్నా.. ఒక మున్సిపాలిటీ దాటగానే మరో మున్సిపాలిటీ అనుమతులు, నిధుల కొరత అడ్డంకిగా మారుతోంది. ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని ఒకే పాలనా గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా మాస్టర్ ప్లాన్‌ను ఏకతాటిపై అమలు చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను మెగా సిటీగా ప్రొజెక్ట్ చేయాలంటే జనాభా, విస్తీర్ణం కీలకం2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, సుమారు 2 కోట్ల జనాభాతో కూడిన నగరం ఏర్పడితే.. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ , జైకా వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి భారీ నిధులు, రుణాలు పొందడం సులభమవుతుంది. రాజకీయంగా చూస్తే.. శివారు ప్రాంతాల్లో ఉన్న వివిధ సమీకరణాలను ఒకే గొడుగు కిందకు తేవడం ద్వారా పాలనపై పట్టు సాధించవచ్చని, తద్వారా నియోజకవర్గాల పునర్విభజన లేదా వార్డుల పెంపు ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.విలీన నిర్ణయం వెలువడగానే అధికారులు తెర వెనుక భారీ కసరత్తు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గత కొన్ని రోజులుగా వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారు ప్రధానంగా దృష్టి పెట్టిన అంశాలు ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 150 వార్డులు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన చూస్తే.. కొన్ని వార్డుల్లో లక్షల్లో జనం ఉంటే, మరికొన్నింటిలో వేలల్లోనే ఉన్నారు.ఈ అసమానతలను తొలగించి, కొత్తగా వచ్చే 27 మున్సిపాలిటీలను కలుపుకుని వార్డుల సంఖ్యను 250కు పెంచాలని అధికారులు ప్రణాళిక రచిస్తున్నారు. ప్రస్తుతం ఒక సర్కిల్ రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉంటోంది. దీనివల్ల పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. దీన్ని సవరించి.. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు సర్కిళ్లు ఉండేలా డీలిమిటేషన్ చేస్తున్నారు. ఇప్పటికే కాప్రా, బేగంపేట్ సర్కిళ్లలో ఈ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 28 సర్కిళ్లలో పనులు జరుగుతున్నాయని సమాచారం.

# 18 గ్రామాల్లో మారుతున్న లెక్కలు

హైదరాబాద్, డిసెంబర్ 02 (భారత శక్తి):

గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే మండల వ్యాప్తంగా రాజకీయాలు హాట్ హాట్ గా మారాయి. మండలంలో రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. అయితే సర్పంచ్, వార్డ్ సభ్యులుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహులు ఇప్పటికే రంగంలోకి దూకేశారు. గ్రామాలలో ఏ కోణంలో చూసిన రాజకీయ సమావేశాలు, చర్చలు, లెక్కలు, పంచాయతీ ఎన్నికల జోరు స్పష్టంగా కనిపిస్తున్నది.రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీ సపోర్టు దక్కించుకోవడం గెలుపునకు కీలకమని భావిస్తున్న ఆశావహులు బడా నాయకుల తలుపులు తడుతున్నారు. ఒక్కో పార్టీలో ఐదునుంచి ఆరుమంది. పోటీ పడుతుండడంతో స్థానిక నాయకులు సుక్క ముక్క ఏర్పాటు చేస్తూ అనుచరులను కాపాడుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఎవరికి టికెట్ ఇవ్వాలి? ఎలా ఇవ్వాలనే సందిగ్ధంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఇద్దరూ పార్టీ క్యాడర్ దెబ్బతినకుండా అభ్యర్థిని ఎంపిక చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నుండి టిక్కెట్ ఖరారు చేసే ప్రయత్నంలో ఉంది. కానీ పార్టీ కోసం కష్టపడ్డ వారికి టికెట్ అనే సీఎం మాటలే గ్రామాలలో చర్చ నీయంశనీగా మారాయి.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సాధ్యం కాకపోవడంతో పాత విధానానికే తిరిగింది. దీంతో పలు గ్రామాలలో రిజర్వేషన్లు తారు మారయ్యాయి. సామాజిక కార్యక్రమాల పేరుతో ఇప్పటికే లక్షలు ఖర్చు చేసిన రిజర్వేషన్ మారకపోవడంతో ఆశావహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్ ఏమవుతుందో అన్న ఉత్కంఠ నెలల పాటు కొనసాగి. చివరకు మారిపోవడంతో చాలామంది తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది.సర్పంచ్ ఓటర్ డ్రాఫ్ట్ సిద్ధం కావడంతో గ్రామాలలో ఎన్నికల చర్చలు భగ్గుమంటున్నాయి. ఎక్కడ ఏ ఫంక్షన్ జరిగిన ఆశావహుల హాజరు తప్పనిసరి. మాట్లాడితే గ్రామాభివృద్ధి, చేతులు కలిపితే మేమున్నాము అన్న సందేశం ఇదే ప్రస్తుతం స్థానిక రాజకీయాల దృశ్యం. ఎవరి బలంఎంత? అనుచరులు ఎంత? గ్రామంలో




మద్దతు ఎలా? అన్నదానిపై రోజంతా లెక్కలు వేసుకుంటున్నారుదీర్ఘకాలంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, ఇటీవల అధికార పార్టీలో చేరి శ్రమించిన నాయకులు ఇలా ఈ రెండు వర్గాల మధ్య పోటీ మండలంలో చెలరేగుతుంది. లోకల్ నాయకుల సపోర్ట్ కోసం ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతూ ఆశావహులు నిత్యం క్యాంప్ చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆశీస్సులు ఉంటే గెలుపు ఖాయం అన్న నమ్మకంతో ప్రతి అభ్యర్థి అండ కోసం పరుగులు పెడుతున్నారుఅధికారంలో లేకపోయినా బి ఆర్ ఎస్ పంచాయతీ ఎన్నికల యుద్ధరంగంలోకి దిగింది. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వయంగా గ్రామాలలో పర్యటిస్తూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అధికార పార్టీ పథకాల లబ్ధిదారుల ఎంపికలో అసంతృప్తి నెలకొనడంతో కొందరు కార్యకర్తలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని చర్చ జరుగుతున్నది. ఈ పరిస్థితిని ప్రతిపక్షం క్యాచ్ చేసుకునే అవకాశం కనిపిస్తుంది.ఎమ్మెల్యే ప్రయారిటీ, రిజర్వేషన్ గందరగోళం,ఆశావహుల హడావుడి, గ్రామాలలో రోజురోజుకు పెరుగుతున్న రాజకీయ వేడి, ఇవన్నీ కలగలిపి పంచాయతీ ఎన్నికలు మండలంలో హోరాహోరీగా సాగను న్నాయని సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీల మధ్య కాదు.. పార్టీ లోపల కూడా నువ్వా.. నేనా? అన్న టఫ్ ఫైట్ తప్పదని రాజకీయ వర్గాల అంచనా వేస్తున్నారు.

# కుమార్తె ప్రేమ వివాహం..

## కుటుంబ సభ్యులు ఏం చేశారంటే?

హైదరాబాద్, డిసెంబర్ 02 (భారత శక్తి):

నేటి కాలంలో ప్రేమ వివాహాలు సర్వసాధారణంగా మారిపోయాయి. అడ్డు చెప్పిన కుటుంబ సభ్యులను లెక్కచేయకుండా యువతి యువకులు ప్రేమ వివాహాలు చేసుకుంటున్నారు. పైగా ఇటీవల కాలంలో ప్రేమ వివాహాలలో సినిమాలను మించి మలుపులు చోటు చేసుకుంటున్నాయి. దాడులకు దిగడం.. ప్రతిదాడులకు వెనుకాడకపోవడం.. దారుణాలకు పాల్పడడం వంటి ఘటనలు ప్రేమ వివాహాల సమయంలో చోటు చేసుకుంటూనే ఉన్నాయి.ఇన్ని ఘటనలు జరుగుతున్నప్పటికీ తమ పిల్లల మనస్తత్వాలను పెద్దలు అర్థం చేసుకోలేకపోతున్నారు. పెద్దలకు తగ్గట్టుగా పిల్లలు ఉండలేకపోతున్నారు. ఇలా పరస్పరం ఘర్షణ పూరితమైన వాతావరణంలో ప్రేమ వివాహాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాలలో ప్రేమ వివాహాలలో ఊహించని దారుణాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి ఘటనల వల్ల ప్రాణాలు కూడా పోతున్నాయి.

ఇన్ని జరుగుతున్నప్పటికీ పిల్లల్లో మార్పు రావడం లేదు. పెద్దలకు జ్ఞానోదయం కలగడం లేదు.తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లాకు చెందిన ముత్తుకుమార్ అనే యువకుడు గుంటూరు జిల్లాకు చెందిన మాధవి అనే యువతిని గత నెల 16న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కొండగట్టు ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం మాధవి కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో వారు వాహనాలలో వచ్చారు. ముత్తుకుమార్ ఉంటున్న ఇంటి అడ్రస్ తెలుసుకుని నేరుగా అక్కడికి వెళ్లారు. తమ కూతురిని వాహనంలో ఎక్కించుకొని బలవంతంగా తీసుకెళ్లారు. ఈ దృశ్యం చూస్తుంటే ప్రేమిస్తే సినిమా మాదిరిగా కనిపించిందని చుట్టుపక్కల వారు అంటున్నారు. వచ్చిన వారంతా ప్రత్యేకమైన వాహనాలలో.. మందీ మార్బలం తో కనిపించారు. దీంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు.తమ ఇంటి మీదికి వచ్చి.. తమ కుమారుడు వివాహం చేసుకున్న అమ్మాయిని అలా బలవంతంగా తీసుకెళ్లడం పట్ల ముత్తుకుమార్ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు మాధవిని తీసుకెళ్తున్న సమయంలో ఆమె కుటుంబ సభ్యులు ముత్తుకుమార్, అతని కుటుంబ సభ్యుల మీద దాడి చేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి.

అంతేకాదు దాడికి సంబంధించిన దృశ్యాలు కూడా సమీపంలో ఉన్న సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. దీంతో ముత్తుకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొత్తానికి ఈ ఘటన మల్యాల ప్రాంతంలో సంచలనం సృష్టించింది.ముత్తుకుమార్ తో ప్రేమ వ్యవహారం మాధవి ఇంట్లో ఇటీవల తెలిసింది. దీంతో ఆమెను బయటికి వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడ్డారు. అయితే మాధవి ఇంట్లో వాళ్లకు తనకు అనారోగ్యంగా ఉందని చెప్పి బయటకు వచ్చింది. ముత్తు కుమార్ ఆమెను అక్కడి నుంచి జగిత్యాల తీసుకువచ్చాడు. తన కుటుంబ సభ్యుల అండదండలతో గత నెల 16న కొండగట్టు ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన మాధవి కుటుంబ సభ్యులు ప్రత్యేకమైన వాహనాల వచ్చి ఆమెను తీసుకెళ్లారు. చివరికి ముత్తుకుమార్ కుటుంబ సభ్యులపై దాడి కూడా చేశారు.

# కన్నీళ్లు తెప్పిస్తున్న రైతు ఆత్మహత్య

ఖమ్మం, డిసెంబర్ 02 (భారత శక్తి):

వ్యవసాయం చేస్తున్న రైతులకు ఎన్నో నష్టాలు వస్తున్నాయని, అతికష్టమ్మీద పంట పండిస్తే దానికి మద్దతు ధర రాదని ఆవేదన వ్యక్తం చేస్తూ కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని, ఎక్కువ మద్దతు ధర ఇవ్వాలని, సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలని.. తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బానోతు వీరన్న సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. పురుగుల మందు తాగిన తరువాత తమ బాధను చెప్పుకుంటూ తీసిన సెల్ఫీ వీడియో వైరల్ అవుతోంది. రైతు ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం అన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నానని.. మద్దతు ధర కల్పించాలని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలకు నిదర్శనం అని విమర్శించారు.కౌలు రైతు వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్య. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా ఆర్థిక తోడ్పాటు లేక, అప్పులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, ఓట్లు వేశాక రైతులను మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో రైతు వీరన్న చెప్పిన మాటలకైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం వస్తుందా?. ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు. ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు?' అని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా కలిసి పోరాటం చేద్దాం. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని' హరీష్ రావు అన్నదాతలకు సూచించారు.

# 12 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసిన రాచకొండ పోలీసులు

ఎల్బీనగర్, డిసెంబర్ 02 (భారత శక్తి):

ఎల్బీనగర్ పోలీసులు గత మూడు నెలలలో పోలీస్ స్టేషన్లో నమోదైన మొబైల్ ఫోన్ల మిస్సింగ్ ఫిర్యాదులను సీఈఐఆర్ పోర్టల్ నందు అప్లోడ్ చేసి ప్రతిరోజు వాటిని ట్రాక్ చేస్తూ ఆ ఫోన్ల యూజర్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ద్వారా గుర్తించి కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని వేరువేరు ప్రాంతాలలో ఉన్న 12 లక్షల విలువైన మొత్తం 125 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి వాటిని రికవరీ చేశారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల యజమానులను మంగళవారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఏసిపి కృష్ణయ్య రికవరీ చేసినటువంటి మిస్సింగ్ అయిన దొంగతనం అయిన మొబైల్ ఫోన్లను యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపి కృష్ణయ్య మాట్లాడుతూ, ప్రజలు బస్సులు ఎక్కే సమయంలో, బస్సులో ప్రయాణించేటప్పుడు,వారాంతపు సంతలలో కూరగాయలు కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఇంకా మొబైల్ బ్యాంక్ ఆప్ లను ఫోన్ పే, గూగుల్ పే, పేటియం ఉపయోగిస్తున్న వారు స్ట్రాంగ్ పాస్వర్డ్, పిన్ కోడ్స్ పెట్టుకోవాలని సూచించారు. ఈ మొబైల్ ఫోన్ల రికవరీలో తన పనితనాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని చూపిన ఎల్బీనగర్ సీఐ వినోద్ కుమార్, డిఐ నాగార్జున రెడ్డి వారి సిబ్బంది, క్రైం పోలీస్ సిబ్బందిని అభినందించారు.



# పర్యాటక, చారిత్రక వైభవాన్ని చాటేలా గండికోట ఉత్సవాలు

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, డిసెంబర్ 2 (భారత శక్తి): జిల్లా పర్యాటక, చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని దేశం నలు దిక్కులా చాటేలా.. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని అలాగే సాస్కి పథకం ద్వారా గండికోట పర్యాటక కేంద్రానికి ప్రపంచ స్థాయిలో కీర్తిని ప్రతిబింబించేలా అభివృద్ధి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

మంగళవారం గండికోట ఉత్సవాల ఏర్పాట్లు, సాస్కి పర్యాటక అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. గండికోట పర్యాటక క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ, ఏపిటిడిసి అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా గండికోట పర్యాటక కేంద్రం అభివృద్ధి పథకంలో భగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించిన నిర్వహణ పనులను, మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా.. అన్ని రకాల పర్యటన ప్రాజెక్టులను చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లో క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ కోసం ప్రత్యేక సహకారం (%బూూజ×%) అందించే పథకం ద్వారా.. గండికోట పర్యాటక కేంద్రంలో సుసంపన్నమైన కోట మరియు గార్జ్ అనుభవాన్ని పర్యాటకుల సొంతం చేసే దిశగా.. జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు.

జనవరి నెల మొదటి వారంలో ప్రారంభం కానున్న గండికోట ఉత్సవాలను జిల్లా పర్యాటక, చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని దేశం నలు దిక్కులా చాటేలా.. దేశం నలుమూలలా విస్తరింపజేసేలా కొన్ని ప్రధాన్యమైన పనులను త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతోందన్నారు. ఉత్సవాలకు మునుపే పూర్తి కావాల్సిన పలు ముఖ్యమైన పనులను పరిశీలించి.. ఎంట్రన్స్, వెలివేషన్, పార్కింగ్, అమినిటీ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజనీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ లను ఆదేశించారు.



ఏపీ టూరిజం కార్పోరేషన్ తో ఏపీలో అమలు చేస్తున్న టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హెూదా కల్పిస్తున్నామన్నారు. గండికోట ప్రాంతాన్ని సాస్కి పథకం ద్వారా రూ.79 కోట్లతో అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పర్యాటకులు బస చేసేలా స్టార్ హెూటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. పర్యాటకులకు సంతృప్తికరమైన అనుభూతిని అందించేందుకు 10,000 %ూఖీ% విస్తీర్ణంలో టూరిస్టు ఎక్స్పీరియన్స్ సెంటర్ ను, 4000 %ూఖీ% విస్తీర్ణంలో రెండు అమినిటీస్, ఇన్ఫర్మేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. అలాగే ఒక టెంట్ సిటీ, 1.5 కిలో మీటరు మేరా గండికోట ఫోర్టు నుండి విజిటర్స్ సెంటర్ వరకు వాకింగ్ ట్రెయల్ ను నిర్మించడం జరుగుతోందన్నారు. ఈ మార్గం మొత్తం కూడా వెహికల్ ఫ్రీ జోన్ గా కేటాయించి.. ఈ మార్గానికి ఇరువైపులా పర్యాటకులు చక్కటి ఆహ్లాదకరమైన అనుభూతిని పొందేలా పలు ప్రత్యేక నిర్మాణాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో పాటు, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గార్జ్ పరిసరాల్లో ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్ తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు.

ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రాండ్ కాన్యన్ ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ సదుపాయం కూడా కల్పించే సందుపాయం కల్పించే పనులకు ప్రాజెక్టులను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు.

అలాగే గండికోట కొట్టాలపల్లె నుండి గండికోట రిజర్వాయర్, డ్యామ్ అందాలను వీక్షించడంతో పాటు.. ఆ మార్గాన్ని కలిపే అనుకూలతలను, గండికోట గార్జ్ వ్యూ పాయింట్ వద్ద ఒబెరాయ్ స్టార్ హెూటల్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు.

జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ఏపీ టిడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, పిఆర్ ఎస్ఈ మద్దన్న, హౌసింగ్ పిడి రాజరత్నం, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ భాస్కర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ గోపీనాథ్, సైట్ ఇంజనీర్ విజయ్, ఆర్కిటెక్చర్ డిజైనర్లు ఇర్ఫాన్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించిన ఏసీపీ కృష్ణయ్య

ఎల్బీనగర్, డిసెంబర్ 02 (భారత శక్తి ):

రోజు వారి విధుల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య సరూర్ నగర్ సీఐ సైదిరెడ్డి, ఎస్ఐ మహేందర్ పోలీస్ సిబ్బంది సరూర్నగర్ జిహెచ్ఎంసి కార్యాలయం ముందు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారి వాహనాలు స్వాధీనం చేసుకొని స్టేషన్ తరలించారు. నెంబర్ ప్లేట్లు సరిగ్గా లేని వాహనాలకు జరిమానా విధించి, నెంబర్ ప్లేట్లపై రిజిస్ట్రేషన్ నెంబర్లు వేయించారు.



# నాగారం గ్రామ సర్పంచిగా చందరాజు లావణ్య సంతోష్ నామినేషన్ దాఖలు

## హాజరైన ఎమ్మెల్యే నాగరాజు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)డిసెంబర్2హసన్ పర్తి మండలం నాగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి చందరాజు లావణ్య సంతోష్ మంగళవారం కార్యకర్తల సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేటఎమ్మెల్యే నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మీడియాతో మాట్లాడుతూప్రభుత్వంతో కలిసి గ్రామాల అభివృద్ధి చేసేటోళ్లను సర్పంచులుగా గెలిపించుకోండని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ %ఉ% ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తంగేళ్ళ తిరుపతి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి ప్రజాప్రతినిధులు కార్యకర్తలు సోషల్ మీడియా వారియర్స్ నాయకులు పాల్గొన్నారు.



# రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన ఐటీ మంత్రి, అధికారులు



మహేశ్వరం, డిసెంబర్ 02 (భారత శక్తి):

మహేశ్వరం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు, రాచకొండ సిపి సుధీర్ బాబు అధికారులతో కలిసి గ్లోబల్ సమ్మిట్ వేదిక వద్ద ఇతర విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.

అనంతరం అన్ని డిపార్ట్మెంట్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమ్మిట్ జరిగే ప్రాంగణంలో ఏర్పాట్లను అధికారులతో స్వయంగా పరిశీలించి వారికి సలహాలు, సూచనలు చేసిన శ్రీధర్ బాబు. అయిదో తారీకు లోపు పనులన్నీ పూర్తి చేసి, ఆరో తేదీన డ్రైరన్ కండక్ట్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా, తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని, ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే అతిథులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని సూచించారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

# తుది మెరుగులు దిద్దుకుంటున్న బమ్మృక్‌నుద్దౌలా చెరువు

## పాతబస్తీకి మణిహారంగా 15 రోజుల్లో ప్రారంభానికి సన్నాహం

## అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, డిసెంబర్ 02 (భారత శక్తి):

పాతబస్తీకి మణిహరంగా చారిత్రక చెరువు బమ్మృక్‌నుద్దౌలా నిలుస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఆక్రమణలతో ఆనవాళ్లను కోల్పోయిన ఈ చెరువు హైడ్రా పునరుద్ధరణతో పూర్వ వైభవాన్ని సంతరించుకుందన్నారు. తుదిమెరుగులు దిద్దుకుంటూ మరో 15 రోజుల్లో ప్రారంభానికి సిద్ధమౌతున్న బమ్మృక్‌నుద్దౌలా చెరువును హైడ్రా కమిషనర్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చుట్టూ బండ్ తో పాటు ఇన్‌లెట్లు, ఔట్ లెట్ల నిర్మాణాన్ని తనిఖీ చేశారు. చెరువుకు మూడు వైపులా నిర్మిస్తున్న ప్రవేశ మార్గాలను పరిశీలించారు. స్థానికంగా ఉన్నవారు సులభంగా చెరువు చెంతకు చేరేలా చూడాలని సూచించారు. నిజాంల కాలంలో ఈ చెరువుకు ఎంతో చరిత్ర ఉందని దానిని పునరావృతం చేసేలా చుట్టూ ఔషధగుణాలున్న మొక్కలతో పాటు చల్లటి నీడనిచ్చే చెట్లను నాటాలన్నారు. అన్ని వయసుల వారూ సులభంగా నడిచేలా వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని.., లైటింగ్ చెరువు చుట్టూ ఉండేలా చూడాలన్నారు. పిల్లల కోసం ప్లే ఏరియాలు, వృద్ధుల కోసం సీటింగ్ జోన్లు, ఓపెన్ జిమ్‌లు, పచ్చికబైళ్లు, పార్కులు వంటి సౌకర్యాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి హైడ్రా ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఇస్లామిక్ సంప్రదాయాలు ఉట్టిపడేలా..**

ఇక్కడ ప్రజలు వచ్చి కూర్చునేందుకు వీలుగా నిర్మిస్తున్న గుమ్మటాల (గజబోలు)తో పాటు ప్రవేశ గేట్లు ఇస్లామిక్ సంప్రదాయాలు ఉట్టిపడేలా అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ క్రమంలోనే చెరువు ఆక్రమణలను గత ఏడాది ఆగస్టు నెలలో తొలగించినట్టు చెప్పారు. 4.12 ఎకరాలుగా మిగిలిపోయిన ఈ చెరువు ఆక్రమణలను తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంతో 18 ఎకరాల మేర విస్తరించడమైదన్నారు. వరద కట్టడితోపాటు భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని హైడ్రా కమిషనర్ చెప్పారు. ఈ చెరువు ఔట్‌లెట్ నుంచి వెళ్లే నీరు కిందకు పోయేలా, కాలువలను అంతే సామర్థ్యంతో నిర్మించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఇప్పటికే రహదారుల విస్తరణతో పాటు నిర్మాణ పనులు చేపట్టామని జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కమిషనర్‌కు వివరించారు.

**హర్షం వ్యక్తం చేసిన స్థానికులు..**



1770లో హైదరాబాదు మూడవ నిజాం సికందర్ జాకు ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్‌ఉద్‌దౌలా నిర్మించిన బమ్మృక్నుద్దౌలా చెరువు. ఈ చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి, ఆ దిగువున నిర్మించిన బావిలోకి ఔషధ గుణాలతో వచ్చిన ఊట నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతే కాదు. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని, ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని, అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లే వారని కొంతమంది పేర్కొంటున్నారు. ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబరపడుతున్నారు. పాతబస్తీలో ఇలాంటి అభివృద్ధి చాలా అవసరం. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని హైడ్రా ఎంతో సమర్థవంతంగా పూర్తి చేసిందని కొనియాడారు. చారిత్రక చెరువు పునరుద్ధరణతో పాతబస్తీకి కొత్త వెలుగులు అందిస్తున్నారని కొనియాడారు.



భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధ్యక్షుడికి మర్యాదపూర్వకంగా శాలువా కప్పి ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు.

ఎల్బీనగర్, డిసెంబర్ 02 (భారత శక్తి):

# హిల్ట్ భూములపై బీఆర్ఎస్ పోరాటం

హైదరాబాద్, డిసెంబర్ 2,

రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది. హైదరాబాద్ మహానగర పరిధిలో రూ. 5 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీపేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దాన్ని అడ్డుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన 'నిజనిర్ధారణ బృందాలను' నియమించారు. దీనిలో భాగంగా పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు.బీఆర్ఎస్ ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల విలువైన భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్.ఆర్.ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ కుంభకోణం నిజా నిజాన్ని ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టేందుకు, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు డిసెంబర్ 3, 4 తేదీల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తాయి. ఈ పర్యటనలలో బీఆర్ఎస్ నాయకులు స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకుని, వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచాలని ప్లాన్ చేశారు. ఈ పర్యటనల్లో, పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేం చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాల డిమాండ్లు, ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును, ప్రభుత్వాలు అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టిన అంశాన్ని, వాటి అసలు ఉద్దేశాలను ఈ బృందాలు ప్రజలకు వివరించనున్నాయి.డిసెంబర్ 3, 4 తేదీలలో స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం ఃఖీూ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. క్లస్టర్-1లో మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో గంగుల కమలాకర్, దేశపతి శ్రీనివాస్ మరియు మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించి స్కామ్ ఎలా జరుగుతుందో వివరించనున్నారు. క్లస్టర్-2లో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చెర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు. క్లస్టర్-3కు సంబంధించి మధుసూదనాచారి, మర్రి రాజశేఖర్ రెడ్డి, రవీందర్ రావు మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడలను సందర్శించి భూముల ధర, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలను ప్రజలకు వివరిస్తారు.ముఖ్యంగా క్లస్టర్-4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. మరోవైపు క్లస్టర్-5లో తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియాలను పరిశీలిస్తారు. క్లస్టర్-6లో చామకూర మల్లారెడ్డి, శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు. క్లస్టర్-7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కార్తీక్ రెడ్డి కాటేదాన్, హయత్ నగర్ లో పర్యటిస్తారు. చివరగా క్లస్టర్-8లో మాజీ మంత్రి మహమూద్ అలీ, దాసోజు శ్రవణ్, ఎండీ సలీం చందులాల్ బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

# ఐఎఎస్ అధికారి కూతురి ఆత్మహత్య
## ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం, కులాంతర వివాహం

విజయవాడ, డిసెంబర్ 2

సామాన్యుల్లోనే కాదు, ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నతాధికారులు సైతం గృహహింస కారణంగా ఎంతో నష్టపోతున్నారు. అత్తింటి వేధింపులతో తాజాగా ఏపీలో ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నివాసం ఉంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి చిన్నరాముడు కుమార్తె మాధురి సాహితీబాయి (27) పెళ్లైన కొన్ని నెలలకే ఆత్మహత్య చేసుకుంది. చిన్న రాముడు ఏపీ ఎస్సీ కార్పొరేషన్ సెక్రటరీగా చేస్తున్నారు. ఐఏఎస్ అధికారి అయిన చిన్నరాముడు కుమార్తె సాహితీబాయికి ఇన్?స్టా?గ్రామ్?లో రాజేష్ నాయుడు అనే యువకుడు పరిచయమయ్యాడు. రాజేష్ నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం బుగ్గనపల్లి తండాకు చెందినవాడు. పెద్దలను ఎదిరించి మరీ 2025 మార్చిలో రాజేష్ నాయుడు, సాహితీబాయి కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన గదిలోని బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పెళ్లయిన మూడో నెల నుంచే భర్త తనను వేధిస్తున్నాడని సాహితీ బాయి తన తల్లిదండ్రులకు తెలిపింది. అత్తింటి వేధింపులు తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న కుమార్తెను పోలీసుల సహకారంతో రెండు నెలల కిందట కుమార్తెను తాడేపల్లిలోని తమ నివాసానికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి సాహితీబాయి పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన బలవన్మరణానికి పాల్పడింది. సమాచాం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. తల్లి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కుమార్తె ఆత్మహత్యపై ఐఏఎస్ చిన్నరాముడు మీడియాతో మాట్లాడారు. తన కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదన్నారు. రాజేష్ నాయుడుకు ఉద్యోగం ఉందని మోసం చేసి, మహానందిలో నా కుమార్తెను రిజిస్టర్ మ్యారేజీ చేసుకున్నాడు. పెద్దల సమక్షంలో గ్రాండ్‌గా మళ్లీ పెళ్లి చేస్తామని చెప్పి అల్లుడితో అమ్మాయిని పంపినట్లు చెప్పారు. ఆ తర్వాత రాజేష్ అదనపు కట్నం కోసం వేధించడం మొలుపెట్టాడని, 'నీకు నేనే దిక్కు, చెప్పిన మాట వినకపోతే చంపేస్తానని' బెదిరించేవాడని చిన్నారాముడు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఫోన్ చేయాలన్నా భర్త పర్మిసన్ తీసుకోవాల్సి వచ్చేదని.. అక్కడ ఉండలేన చెప్పడంతో రెండు నెలల కిందట కుమార్తెను ఇంటికి తీసుకొచ్చామన్నారు. తన భర్తది నిజమైన ప్రేమ కాదని, డబ్బు కోసం పెళ్లి చేసుకున్నాడని.. అందుకే వచ్చి తనను తీసుకెళ్లడం లేదని బాధపడేది. కానీ ఇలా చేస్తుందని అనుకోలేదంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

# 2027 నాటికి పోలవరం తొలిదశ పునరావాసం

ఏలూరు, డిసెంబర్ 2,

ఏపీ లైఫ్ లైన్ అయిన పోలవరం ప్రాజెక్టు తొలిదశ పునరావాసాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేయడానికి ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను పునరావాస కమిషనర్ తాజాగా పోలవరం అథారిటీకి సమర్పించారు. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీళు నిల్వ ఉంచాలంటే దాదాపు లక్ష కుటుంబాలను (96,660) తరలించడం తప్పనిసరి. అయితే, అధికారులు తొలిదశలో 38,060 కుటుంబాలను తరలించి, ఆ మేరకు మాత్రమే నీటిని నిల్వ చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వేలాది కుటుంబాలను వేరే ప్రాంతాలకు తరలించి వారికి ఇళ్లు కట్టించడంతో పాటు సాగు చేసుకునేందుకు పొలాలు, ఉపాధి అవకాశాలు చూపించాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ఎలాంటి పని చేయకపోవడంతో, ఇప్పుడు ఏపీ ప్రభుత్వం పనులు చేపట్టి పూర్తి చేయాల్సి ఉంటుంది. తొలిదశ పునరావాసానికి ఇంకా ?6,102.39 కోట్ల నిధులు కావాలి. తర్వాత, రెండో దశలో 58,600 కుటుంబాలను తరలించాల్సి ఉంది. దీని కోసం కేంద్రం నుంచి ఇంకా నిధులు మంజూరు కావాల్సి ఉంది.పోలవరం డ్యామ్, కుడి, ఎడమ కాలువలకు అవసరమైన భూసేకరణ పూర్తయింది. అయితే పునరావాసానికి భూసేకరణ తొలిదశ వరకే చేయనున్నారు. దీనిని 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తొలిదశలో తరలించాల్సిన మొత్తం నిర్వాసిత కుటుంబాలు 38,060 ఉన్నాయి. వీటిని 1ం, 1ః అనే రెండు భాగాలుగా విభజించారు. ప్రాథమికంగా +45.72 మీటర్ల నీటిమట్టం వద్దే ముంపు వస్తుందని భావించినప్పటికీ, తర్వాత +41.15 మీటర్ల నీటిమట్టానికే ముంపు తప్పదని తేల్చడంతో తొలిదశ నిర్వాసితుల సంఖ్య పెరిగింది. 1ం కింద 20,946 కుటుంబాలు, 1ః కింద 17,114 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటివరకు 14,385 కుటుంబాలను తరలించగా, ఇంకా 23,675 కుటుంబాలను అక్కడి నుంచి తరలించాల్సి ఉంది.1ం కింద ఉన్న 6,561 కుటుంబాల కోసం ప్రస్తుతం 49 కాలనీలు నిర్మిస్తున్నారు. కొత్తగా



టెండర్లు పిలిచి, కొత్త కాంట్రాక్టర్లకు అప్పజెప్పి పనులు వేగవంతం చేయాలని చూస్తున్నారు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ జరుగుతోంది. ఇక, 1ః లో సొంతంగా ఇళు కట్టుకుంటామన్న వారు పోను, మిగిలిన కుటుంబాల తరలింపునకు అవసరమైన కాలనీల నిర్మాణానికి 2026 మార్చిలో టెండర్లు పిలిచి, 2027 మార్చికి పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. పోలవరం 1ః కింద నిర్వాసితుల తరలింపు విషయంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. గంగవరం, అడ్డతీగల మండలాల్లో గుర్తించిన భూములు తమకు వద్దని నిర్వాసితులు చెబుతున్నారు. భూములు మండల కేంద్రాల నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, అంత లోపలికి వెళ్లడానికి తాము సిద్ధంగా లేమని చెబుతున్నారు. రోడ్డుకు దగ్గరగా అనువైన భూములు లేకపోవడంతో సమస్య వచ్చింది. గిరిజనేతర భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయి. ఆ భూములను ఆక్రమించుకున్న వారు భూసేకరణకు సహకరించకపోవడంతో పునరావాస ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. వీటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు: జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం : డిసెంబర్ 2పోలీసు సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సు దృష్ట్యా జిల్లాలో పని చేస్తున్న హోమ్ గార్డు, పోలీసు సిబ్బంది, అధికారులు ప్రతి ఒక్కరుకి ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాగోలు జేమ్స్ హాస్పిటల్ వారు సౌజన్యంతో హాస్పిటల్ నందు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పర్యవేక్షణ లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్ల బృందం జనరల్ చెకప్ తో పాటు షుగర్, బీపీ, హృదయ సంబంధిత సమస్యలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు వంటి అనేక విభాగాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలు రోజు వారి కొంత మంది చొప్పున జిల్లా వ్యాప్తంగా ఉన్న సిబ్బంది అందరికీ జరుగునున్నాయి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని అన్నారు. సిబ్బంది సంక్షేమం దృష్ట్యా ఆరోగ్యం పరిరక్షణ కోసం ఇలాంటి వైద్య శిబిరాలను తరచూ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యవంతమైన పోలీసు సిబ్బందే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరు అని జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# ఢిల్లీలో లోకేశ్ బిజీబిజీ




న్యూఢిల్లీ, డిసెంబర్ 2

మొంథా తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయు, ఉద్యాన రంగాలకు అపార నష్టం వాటిల్లిందని రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో వారు సమావేశమై, రాష్ట్రంలో తుపాను సృష్టించిన నష్టంపై వివరాలు అందజేశారు.గత నెల 28, 29 తేదీల్లో సంభవించిన మొంథా తుపాను వల్ల రాష్ట్రంలోని 24 జిల్లాల్లో 443 మండలాల పరిధిలోని 3,109 గ్రామాలు ప్రభావితమయ్యాయని మంత్రులు వివరించారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా సుమారు 9.53 లక్షల మంది ప్రజలు నష్టపోయారని తెలిపారు. భారీ వర్షాలు, వరదల వల్ల పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని పేర్కొన్నారు.మంత్రులు అందించిన వివరాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.61 లక్షల హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ వంటి వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. దీనివల్ల 3.27 లక్షల మంది రైతులు ప్రభావితమయ్యారు. వ్యవసాయంతో పాటు, 6,250 హెక్టార్లలో అరటి, బొప్పాయి, కొబ్బరి, మిరప వంటి ఉద్యాన పంటలు కూడా ధ్వంసమయ్యాయని కేంద్ర మంత్రికి తెలిపారు. పంట నష్టంతో పాటు చెరువులు, కాలువలు, నర్సరీలు, షేడ్‌నెట్‌లు వంటి మౌలిక సదుపాయాలు కూడా దెబ్బతిన్నాయని వివరించారు.తుపాను సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించిందని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక శిబిరాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టిందని మంత్రి లోకేశ్ తెలిపారు. ూఆఖీఈ, ఔఆఖీఈ బృందాలను మోహరించి ప్రాణ నష్టాన్ని నివారించగలిగామని కేంద్ర మంత్రికి వివరించారు.

# పుతిన్‌కు ఫుడ్, వాటర్, టాయ్ లెట్స్ అన్నీ రష్యా నుంచే

న్యూఢిల్లీ, డిసెంబర్ 2,

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న ఏర్పాట్లు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆయన తాగే నీరు, తినే ఆహారం మాత్రమే కాదు.. ఉపయోగించే టాయిలెట్‌ను కూడా రష్యా నుంచే ప్రత్యేకంగా తీసుకురానుండటం ఆయన భద్రతా ప్రమాణాల తీవ్రతను తెలియజేస్తోంది.విదేశీ పర్యటనల్లో పుతిన్ భద్రతను ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ పర్యవేక్షిస్తుంది. అధ్యక్షుడి రాకకు నెల రోజుల ముందే ఒక బృందం ఆతిథ్య దేశానికి చేరుకొని, ఆయన బస చేసే హోటల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తుంది. ఆయన వాడే సబ్బులు, షాంపూల నుంచి టూత్‌పేస్ట్ వరకు అన్నీ రష్యా నుంచే తెచ్చి హోటల్ గదిలో అమర్చుతారు. భద్రతా కారణాల దృష్ట్యా పుతిన్ మొబైల్ ఫోన్ ఉపయోగించరు. అత్యంత సురక్షితమైన కమ్యూనికేషన్ లైన్ ద్వారానే సంభాషణలు జరుపుతారు. ఇందుకోసం ఆయన గదిలోనే ప్రత్యేక టెలిఫోన్ బూత్‌ను ఏర్పాటు చేస్తారు.పుతిన్ ప్రయాణించే ఇల్యూషిన్ ఐఎల్-96-300పీయూ విమానాన్ని 'ఎగిరే క్రెమ్లిన్' అని పిలుస్తారు. ఇందులో సమావేశ గదులు, జిమ్, మెడికల్ రూమ్‌తో పాటు అణుదాడికి ఆదేశాలు జారీ చేసే 'న్యూక్లియర్ కమాండ్ బటన్' కూడా ఉంటుంది. ఆయన విమానానికి యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా ఉంటాయి. సాంకేతిక సమస్యలు ఎదురైతే, ప్రత్యామ్నాయంగా మరో విమానాన్ని కూడా వెంట తీసుకువస్తారు. పర్యటనలో పుతిన్ ప్రయాణించే 'ఆరస్ సెనెట్' కారును కూడా రష్యా నుంచే తీసుకొస్తారు. ఈ కారు బుల్లెట్లు, గ్రెనేడ్లు, రసాయన దాడులను సైతం తట్టుకోగలదు. నాలుగు టైర్లు



పంక్చర్ అయినా ఆగకుండా ప్రయాణించగలదు. ఇక ఆహారం విషయానికొస్తే, రష్యా నుంచి తెచ్చిన పదార్థాలను ప్రత్యేక చెఫ్‌లు వండుతారు. వండిన ఆహారాన్ని పుతిన్ తినే ముందు పరీక్షించడానికి ఒక మొబైల్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. బహిరంగ కార్యక్రమాల్లో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించే పుతిన్ చుట్టూ ఎల్లప్పుడూ నాలుగంచెల భద్రతా వలయం ఉంటుంది.




# రోహిత్ శర్మ 2007 వరల్డ్ కప్ ఆడినప్పుడు
# నేను స్కూల్‌లో ఉన్నా: తెంబా బావుమా

భారత్, సౌతాఫ్రికా మధ్య బుధవారం (డిసెంబర్ 3న) రెండో వన్డే జరగనుంది. రాయ్‌పూర్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. తొలి వన్డేకు దూరంగా ఉన్న సౌతాఫ్రికా కెప్టెన్ తెంబా బావుమా రెండో వన్డేకు అందుబాటులో ఉండనున్నాడు. మంగళవారం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బావుమా మాట్లాడుతూ.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రాకతో టీమ్ఇండియా బలంగా మారిందని, అయితే రోకోను ఎదుర్కోవడం తమకు కొత్తేమీ కాదన్నాడు. 2007 టీ20 ప్రపంచ కప్‌లో రోహిత్ ఆడుతున్నప్పుడు తాను స్కూల్‌లో ఉన్నానని బావుమా గుర్తుచేసుకున్నాడు. టీమ్ఇండియా



2007 టీ20 ప్రపంచ కప్ సాధించిన జట్టులో రోహిత్ శర్మ సభ్యుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ‘

కోహ్లీ, రోహిత్ వరల్డ్ క్లాస్ ప్లేయర్స్. వారితో చాలా మ్యాచ్‌లు ఆడాం. కొన్నిసార్లు పైచేయి సాధించాం. ఇవన్నీ సిరీస్‌ను మరింత ఉత్తేజకరంగా మారుస్తాయి’ అని బావుమా పేర్కొన్నాడు. సౌతాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో భారత్ 17 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. కోహ్లీ (135) సెంచరీ చేయగా.. రోహిత్ (57) హాఫ్ సెంచరీతో మెరిశాడు. రాయ్‌పూర్‌లో జరిగే మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్ఇండియా పట్టుదలతో ఉంది. ఈ మైదానంలో భారత్ ఇప్పటివరకు ఒకే వన్డే మ్యాచ్ ఆడగా.. ఘన విజయం సాధించింది.

# విజయ్ హజారే ట్రోఫీలో
# ఆడేందుకు నో చెప్పిన కోహ్లీ?

భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేలు మాత్రమే ఆడుతున్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ ప్రపంచ కప్ ఆడాలనుకుంటున్నారు. కానీ, అప్పటివరకు మ్యాచ్ ఫిట్‌నెస్ కాపాడుకోవడం కీలకం. ఈ నేపథ్యంలో దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని వీరిద్దరికి బీసీసీఐ సూచించినట్లు వార్తలొస్తున్నాయి. రానున్న విజయ్ హజారే ట్రోఫీలో ముంబయి తరపున ఆడతానని సెలక్షన్ కమిటీకి రోహిత్ ఇప్పటికే స్పష్టత ఇచ్చాడు. కోహ్లీ మాత్రం విజయ్ హజారే ట్రోఫీలో ఆడటానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ ట్రోఫీలో ఆడబోనని సెలక్షన్ కమిటీకి విరాట్ సమాచారం ఇచ్చినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ‘సమస్య విజయ్ హజారే ట్రోఫీకి సంబంధించినది. అతను (కోహ్లీ) ఆడటానికి ఇష్టపడడు. రోహిత్ శర్మ ఆడుతున్నప్పుడు ఒక ఆటగాడికి మినహాయింపు ఎలా ఉంటుంది? ఇతర ఆటగాళ్లకు ఏమని సమాధానం చెప్పాలి?’ అని బీసీసీఐ వర్గాలు జాతీయ మీడియాతో పేర్కొన్నాయి. తాను ఎప్పుడు మైదానంలోకి వచ్చినా 120 శాతం సన్నద్ధతతో ఉంటానని.. మ్యాచ్‌లకు ముందు మరీ ఎక్కువ సాధన అవసరం లేదని



సౌతాఫ్రికాతో రాంచీలో జరిగిన తొలి వన్డే అనంతరం బహుమతి ప్రదానోత్సవంలో కోహ్లీ అన్నాడు. హెడ్ కోచ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అగార్కర్‌లను ఉద్దేశించే విరాట్ ఈ వ్యాఖ్యలు చేశాడనే చర్చ జరుగుతోంది.

# హార్దిక్ పునరాగమనం అదుర్స్..
# తొలి మ్యాచ్‌లోనే చెలరేగిన ఆల్‌రౌండర్

హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో బరోడా వరుసగా రెండో విజయం సాధించింది. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో బరోడా 7 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఈ భారీ టార్గెట్‌ని బరోడా 19.1 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేసిన హార్దిక్ పాండ్య (77*; 42 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలుత ఓపెనర్లు విష్ణు సోలంకి (43; 21 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), శాశ్వత్ రావత్ (31; 18 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. వన్‌డౌన్ బ్యాటర్ శివాలిక్ వర్మ (47; 31 బంతుల్లో) రాణించాడు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ బ్యాటర్లలో కెప్టెన్ అభిషేక్ శర్మ (50; 19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు హాఫ్ సెంచరీ చేశాడు. అన్మోల్‌ప్రీత్ సింగ్ (69; 32 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), నమన్ ధీర్ (39; 28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. బరోడా బౌలర్లలో రాజ్ లింబానీ 3, రసిఖ్ సలామ్, హార్దిక్ పాండ్య, అతిత్ షెత్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన హార్దిక్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ ఏడాది జరిగిన ఆసియా కప్ సూపర్ 4లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా గాయపడిన హార్దిక్ ఇటీవల కోలుకుని ఫిట్‌నెస్ సాధించాడు.



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ బరిలోకి దిగి డిసెంబర్ 9 నుంచి సౌతాఫ్రికాతో మొదలుకానున్న టీ20 సిరీస్‌కు సిద్ధమవుతున్నాడు.

# నేను కోచ్‌గా ఉంటే ఓటమికి బాధ్యత వహించేవాడిని: రవిశాస్త్రి

గౌతమ్ గంభీర్ కోచ్ అయిన తర్వాత స్వదేశంలో భారత్ రెండు టెస్టు సిరీస్‌ల్లో వైట్‌వాష్‌కు గురైంది. దీంతో అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలొస్తున్నాయి. ఇటీవల సౌతాఫ్రికాతో జరిగిన టీమ్ఇండియా అత్యంత పేలవమైన ఆటతీరు ప్రదర్శించింది. సఫారీ స్పిన్నర్లను ఎదుర్కోలేక భారత బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. బౌలర్లు కూడా ప్రభావం చూపలేకపోయారు. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ వైట్‌వాష్ గురించి మాజీ కోచ్ రవిశాస్త్రి తాజాగా స్పందించాడు. తాను గంభీర్‌ను సపోర్ట్ చేయడం లేదని, కానీ ఆటగాళ్లు కూడా మరింత బాధ్యతాయుతంగా ఆడాల్సిన అవసరముందని పేర్కొన్నాడు. ‘గువాహటి టెస్టులో భారత్ టాప్ ఆర్డర్ విఫలమైంది. 95/1 నుంచి చూస్తుండగానే వరుసగా వికెట్లు కోల్పోయి 130/7తో కష్టాల్లో పడింది. అలా అని టీమ్ఇండియా పేలవమైన జట్టు కాదు. మన ఆటగాళ్లు ఎంతో ప్రతిభావంతులు. వారికి స్పిన్ బౌలింగ్ ఎదుర్కోవడం కొత్త కాదు. చిన్నప్పటి నుంచి స్పిన్ ఆడుతున్నారు. కాబట్టి, కచ్చితంగా వారు మరింత బాధ్యత తీసుకుని ఆడాలి’ అని రవిశాస్త్రి వివరించాడు. జట్టు పేలవ ప్రదర్శన విషయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను మీరు రక్షిస్తున్నారా? అని ప్రశ్నించగా.. ‘నేను అతడిని కాపాడటం లేదు. 100 శాతం అతను కూడా బాధ్యత తీసుకోవాలి. నేను కోచ్‌గా ఉన్నప్పుడు ఇది జరిగిఉంటే మొదటి నేనే బాధ్యత తీసుకునేవాడిని. కానీ, జట్టు సమావేశంలో ఆటగాళ్లను కచ్చితంగా ప్రశ్నించేవాడిని’ అని సమాధానమిచ్చాడు.






# ‘హైవేపై పొంచి ఉన్న ప్రమాదం’..
# ముందుగానే SMS, వాట్సప్‌తో అలర్ట్!

దిల్లీ: జాతీయ రహదారులపై ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టెలికాం ఆధారిత సేఫ్టీ అలర్ట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రిలయన్స్ జియోతో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.

**ఎలా పనిచేస్తుంది?**

జియో 4G, 5G నెట్‌వర్క్‌తో ప్రయాణికుల ఫోన్లకు ముందుగానే హెచ్చరిక సందేశాలు అందుతాయి. ప్రమాదకర ప్రాంతాలు, పశువులు ఉండే జోన్లు, దట్టమైన పొగమంచు ప్రదేశాలు, అత్యవసరంగా మళ్లించిన మార్గాల గురించి ప్రయాణికులను ముందుగానే అప్రమత్తం చేస్తారు. ఎసెమ్మెస్, వాట్సప్, హైప్రయారిటీ కాల్స్ ద్వారా అలర్ట్ చేస్తారు. ఈ సిస్టమ్‌ను (Telecom Based Safety Alert System) ‘రాజ్‌మార్గ్‌యాత్ర’ మొబైల్ యాప్, ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నంబర్ 1033 వంటి NHAI ఆధ్వర్యంలోని డిజిటల్ మాధ్యమాలకు దశలవారీగా అనుసంధానం చేస్తారు.

**ప్రత్యేక హార్డ్‌వేర్ అవసరం లేదు!**

ఈ కొత్త వ్యవస్థ కోసం ప్రత్యేకంగా రోడ్డు పక్కన ఎలాంటి హార్డ్‌వేర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఉన్న టెలికాం టవర్ల ద్వారానే ఇది పనిచేస్తుంది. ఫలితంగా చాలా వేగంగా ఈ అలర్ట్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ సేవలు జియో యూజర్లకు అందుబాటులోకి రానున్నాయి. తర్వాత మిగతా టెలికాం సంస్థలతోనూ ఒప్పందం కుదుర్చుకుంటామని NHAI తెలిపింది.

# వరుసగా రెండో రోజూ
# నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. గరిష్ఠ స్థాయిల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో వరుసగా రెండోరోజూ నష్టాలు తప్పలేదు. రూపాయి విలువ బలహీనపడడం, విదేశీ మదుపర్ల అమ్మకాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఇంట్రాడేలో డాలరుతో రూపాయి మారకం విలువ 90 డాలర్ల వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. రేపటి నుంచి ప్రారంభమయ్యే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ భేటీపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉందని అనలిస్టులు భావిస్తున్నారు. డిసెంబర్ 5న ఆర్‌బీఐ తన నిర్ణయాన్ని వెలువరిస్తుంది. సెన్సెక్స్



ఉదయం 85,325.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,641.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 85,053 85, 553 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 503 పాయింట్ల నష్టంతో 85,138.27 వద్ద ముగిసింది. నిఫ్టీ 143.55 పాయింట్ల నష్టంతో 26,032 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.91గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, బీఈఎల్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, హిందుస్థాన్ యూనిలీవర్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63.11 డాలర్లు, బంగారం ఔన్సు 4186 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

# సిమ్ బైండింగ్ రూల్స్‌పై మెటా, గూగుల్ అభ్యంతరం!



దిల్లీ: ఫోన్‌లో సిమ్ ఉంటేనే వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి యాప్స్ పనిచేసేలా కేంద్రం తీసుకొచ్చిన సిమ్ బైండింగ్ నిబంధనలపై బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరమ్ అభ్యంతరం వ్యక్తంచేసింది. తక్షణమే అమలు నిర్ణయాన్ని నిలిపివేయాలని కోరింది. ఈ అంశంపై భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు జరపాలంది. ఇతర దేశాల నుంచి సైబర్ నేరాలను జరగకుండా నివారించాలన్న మంచి ఉద్దేశంతోనే ఈ నిబంధన తీసుకొచ్చినప్పటికీ.. అధికార పరిధి, వినియోదారులపై ప్రభావం, రిస్క్ వంటి అంశాలను టెలికాం సైబర్ భద్రతా నియమాలు విస్మరించాయని పేర్కొంది. మెటా, గూగుల్ వంటి ప్రముఖ టెక్నాలజీ సంస్థలకు బీఐఎఫ్ ప్రాతినిధ్యం వహిస్తోంది. వాట్సప్, టెలిగ్రామ్ లాంటి మెసేజింగ్ యాప్స్‌కు సిమ్ కార్డు లింకప్ తప్పనిసరి చేస్తూ టెలికాం విభాగం ‘డాట్’ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కమ్యూనికేషన్ యాప్స్‌లో దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు డాట్ తెలిపింది. ఇకపై ఫోన్‌లో సిమ్ కార్డు లేకపోతే యాప్ సేవలు వాటంతట అవే ఆగిపోతాయని స్పష్టంచేసింది. వెబ్‌లో లాగిన్ అయిన తర్వాత ప్రతి ఆరు గంటలకు లాగౌట్ అయ్యేలా చూడలని సూచించింది. ఈ నిబంధనల అమలుకు 90 రోజుల గడువు విధించింది. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని టెలికాం ఆపరేటర్ల సంఘం కాయ్ స్వాగతించింది. ఆదేశాల అమలుకు కట్టుబడి ఉంటామని ప్రకటించింది. ఓటీటీ కమ్యూనికేషన్ యాప్స్‌కు ప్రాతినిధ్య వహిస్తున్న బీఐఎఫ్ మాత్రం అభ్యంతరం లేవనెత్తింది. డాట్ ఆదేశాలు చాలా ఆందోళనకరంగా ఉన్నాయని బీఐఎఫ్ తన ప్రకటనలో పేర్కొంది. నిర్వహణాపరమైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోకుండా మార్గదర్శకాలు జారీ చేయడం తీవ్ర నిరాశకు గురిచేసిందని తెలిపింది. ప్రజలతో సంప్రదింపులు, వినియోగదారులతో ప్రభావం వంటి అంశాలను ఏవీ పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొంది. కాబట్టి తక్షణమే అమలును నిలిపివేయాలని కోరింది. ఓఎస్ ప్రొవైడర్లకు చెందిన టెక్నికల్ వర్కింగ్ గ్రూప్, టెలికమ్యూనికేషన్ ఐడెంటిఫై ఎంటిటీస్, సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్‌లు తదితరులతో కూడిన భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు జరపాలని కేంద్రాన్ని కోరింది. భారత టెలికాం సైబర్‌సెక్యూరిటీని బలోపేతం చేసేందుకు తాము నిర్మాణాత్మకంగా కలిసి పనిచేస్తామని బీఐఎఫ్ ప్రెసిడెంట్ టీవీ రామచంద్రన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications , D.No.42/51-3, NGO Colony,Chinna Chowk, Kadapa.516002. Andhra Pradesh. Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI APTEL/2007/22497, Editor: Kesaram Penta Reddy